శనివారం
SATURDAY
14-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 135

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





మృత్యువే కంటైనర్!

అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం.. 23 మంది దుర్మరణం

మినీ బస్సును ఢీకొన్న కంటైనర్.. మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులే

గౌహతి, నవంబర్ 13 (ఈవార్తలు): అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కజిరంగా సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కనీసం 23 మంది చనిపోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొకాఖాట్ నుంచి నాగావ్ వైపు వెళ్తున్న మినీ బస్సు కజిరంగా తరువాయి 2 వ పేజీలో...



ఇన్వెస్టినేషన్.. తెలంగాణ

పెట్టుబడులు పెట్టండి.. అన్ని విధాలా సహకరిస్తాం

తెలంగాణ అవకాశాల ఖని.. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

భారత్ సమ్మిట్‌లో పలు కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం



తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసానిచ్చారు. శుక్రవారం హెచ్‌ఐసీసీ లో జరుగుతున్న భారత్ సమ్మిట్-2026లో భాగంగా ఆయన ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ/ఐటీఈఎస్, మినరల్స్, ఈఎస్ డీఎం మాన్యుఫ్యాక్చరింగ్, టెలికాం, మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇంజినీరింగ్, అర్బన్ మొబిలిటీ, బ్యాటరీ సెల్ టెక్నాలజీ అండ్ ఎనర్జీ స్టోరేజ్, ట్రేడ్ ఫెసిలిటేషన్, సప్లై చైన్, ఫార్మాస్యూటికల్ మాన్యుఫాక్చరింగ్, వేస్ట్ టూ ఎనర్జీ తదితర రంగాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): వీరిలో టర్కీ, కెనడా, సౌత్ ఆఫ్రికా, యూకే, యూఎస్ఏ ప్రతినిధులు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న విస్తృత అవకాశాలు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన పారిశ్రామిక విధానాలను , వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న అపకాశాలను ఈ సందర్భంగా వారికి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఎలక్ట్రానిక్స్, తయారీ, ఔషధాలు, క్లీన్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, టెలికాం ఇంజినీరింగ్, ఫార్మా, ఐటీ/ ఐటీఈఎస్ సహా వివిధ తరువాయి 2 వ పేజీలో...





ఎల్‌నినో.. ఒళ్లు గుల్ల

ఆరోగ్య సమస్యల ముప్పు.. అంటువ్యాధుల ప్రమాదం

భారత్‌కు డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక.. ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచన

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వడగాలులు, కరవు, అంటువ్యాధులు, ఆహార కొరత వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) హెచ్చరించింది. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని అత్యున్నత స్థాయి అత్యవసర స్పందనను ప్రారంభించింది. అధిక లేదా అత్యధిక ఆరోగ్య ముప్పు ఎదుర్కొనే దేశాల జాబితాలో భారత్‌ను చేర్చింది. దక్షిణాసియాలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నందున ముందస్తు సన్నద్ధత అవసరమని స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ, నవంబర్ 13: నవంబర్ 2న విడుదల చేసిన వ్యూహాత్మక సన్నద్ధత, స్పందన ప్రణాళికలో డబ్ల్యూహెచ్ఓ ఈ వివరాలను వెల్లడించింది. 2026 అక్టోబర్ నుంచి 2027 సెప్టెంబర్ వరకు గ్రేడ్-3 స్థాయి అత్యవసర స్పందన కొనసాగనుంది. ఇది డబ్ల్యూహెచ్ఓలో అత్యున్నత స్థాయి స్పందన. వ్యాధుల గుర్తింపు, పర్యవేక్షణ, నివారణ, వైద్య సేవలు, విభాగాల మధ్య సమన్వయంపై దృష్టి పెట్టనున్నారు. తొలి ఆరు నెలల కార్యక్రమాల కోసం సుమారు 3.5 కోట్ల డాలర్లు అవసరమని అంచనా వేశారు. ఎల్‌నినో నేరుగా వ్యాధులకు తరువాయి 2 వ పేజీలో...

ఓలాకు

రూ.10 లక్షల ఫైన్

క్యాబ్ త్వరగా రావాలంటే ముందే టిప్‌పై ఆగ్రహం

వినియోగదారులను తప్పదోవ పట్టిస్తోందన్న సీసీపీఏ



న్యూఢిల్లీ, నవంబర్ 13: క్యాబ్ బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా డబ్బులు చెల్లించేలా వినియోగదారులను ప్రోత్సహిస్తున్న ఓలా విధానంపై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) చర్యలు తీసుకుంది. ఈ విధానాన్ని అన్యాయమైన వ్యాపార పద్ధతిగా, వినియోగదారులను -2 వ పేజీలో...

15 మందికి 'అర్జున'

క్రీడాకారులకు రాష్ట్రపతి సత్కారం.. తేజస్విన్ శంకర్, దివ్య దేశ్‌ముఖ్‌కు పురస్కారాలు

న్యూఢిల్లీ, నవంబర్ 13: క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కోచ్‌లకు జాతీయ క్రీడా పురస్కారాలు-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే మహిళల తరువాయి 2 వ పేజీలో...



5 కార్లున్నా క్యాబ్ రెంటల్

2

కనీస కార్ల సంఖ్య భారీగా తగ్గింపు

ఒకే లైసెన్స్‌తో రాష్ట్రవ్యాప్తంగా సేవలు

కేంద్రం కొత్త నిబంధనలు జారీ

VANGS
GLOBAL TECHNOLOGIES LLP

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

ePaper Pro

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
- Automatic PDF extraction
- Custom domain & push alerts
- Web stories, gallery, headlines
- Country & device-wise views

₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- Android app + configuration
- WhatsApp & email support
- Theme builder & ID card design
- Web stories, gallery, headlines

₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- Android app + configuration
- WhatsApp & email support
- Theme builder & ID card design
- Web stories, gallery, headlines

₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to Interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- Automatic PDF extraction
- Custom domain & push alerts
- Unlimited pageviews & SEO
- Country & device-wise views

₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- Android app & email support
- Drag & drop theme builder
- Employee ID card design
- Custom domain & push alerts

₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- Android app + configuration
- WhatsApp & email support
- Theme builder & ID card design
- Custom domain & push alerts

₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- Automatic PDF extraction
- Custom domain & push alerts
- Web stories, gallery, headlines
- Country & device-wise views

₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- Android app + configuration
- WhatsApp & email support
- Theme builder & ID card design
- Web stories, gallery, headlines

₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
- Android app + configuration
- WhatsApp & email support
- Theme builder & ID card design
- Web stories, gallery, headlines

₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
- Smart AI image extraction
- AdSense & sponsor ad slots
- Custom domain + auto SSL
- One-click publishing
- WhatsApp sharing
- AI tagging & SEO tags
- Real-time analytics
- AWS cloud - daily backups
- YouTube Video embedding

Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication

CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

రాశి ఫలాలు
14.11.2026

మేషం: వృత్తి వ్యాపారాలు మిశ్రమంగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృధా ఖర్చులు అదుపు చేయడం కష్టంగా మారుతుంది. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. కుటుంబ సభ్యుల మాటలు వివాదాస్పదంగా మారుతాయి.

వృషభం: ధనాదాయ విషయాలలో లోటుపాట్లు ఉంటాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు దర్శనం చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అనుకోని సమస్యలు తలెత్తుతాయి. ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వేయటం మంచిది.

మిథునం: నిరుద్యోగుల కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది. సమాజంలో ప్రముఖ వ్యక్తుల ఆదరణ పెరుగుతుంది. శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున హోదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం: చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. సంతాన ఆరోగ్య సమస్యలు భాదిస్తాయి. వృత్తి, ఉద్యోగాలు మందకోడిగా సాగుతాయి. వ్యాపార పరంగా తీసుకున్న నిర్ణయాల వలన ధనవ్యయం కలుగుతుంది.దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటాబయట ప్రతికూల వాతావరణం ఉంటుంది.

సింహం: ఉద్యోగాలలో అధికారులతో ఉన్న సమస్యలు రాజీ చేసుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సన్నిహితుల నుంచి అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

కన్య: నిరుద్యోగ ప్రయత్నాలు వాయిదా పడుతాయి. ధన పరంగా ఇబ్బందులు ఎదురవుతాయి. కుటుంబ కలహాలు కలుగుతాయి. ఉద్యోగ వ్యాపారములలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నూతన ఋణాలు చెయ్యవలసి వస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో స్థిరమైన ఆలోచనలు చెయ్యలేరు.

తుల: వ్యాపారంలో ఆశించిన ఫలితాలుంటాయి. నిరుద్యోగులకు అప్రయత్న కార్య సిద్ధి కలుగుతుంది. పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో అనుకున్న సమయానికి పనులు పూర్తి అవుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. మొండి బాకీలు వసూలు అవుతాయి.

వృశ్చికం: వ్యాపార పరంగా అభివృద్ధి సాధిస్తారు. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

ధనస్సు: ఉద్యోగస్థులకు ఊహించని స్థానచలనాలుంటాయి. ఇతరులతో నిదానంగా వ్యవహరించడం మంచిది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధుమిత్రులతో శుభకార్య విషయమై చర్చలు చేస్తారు. కుటుంబ సభ్యుల మాటలు ఆశ్చర్యం కలిగిస్తాయి. వ్యాపారపరంగా ఆశించిన ఫలితాలు ఉండవు. ఉద్యోగమున సహోద్యోగులతో మాట పట్టింపులుంటాయి. ఆర్థికంగా ఒడిదుడుకులు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

కుంభం: సమాజంలో ప్రముఖుల పరిచయాలు పెరుగుతాయి. ధార్మిక సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో ఉన్నత అధికారుల నుండి అనుకూలత పెరుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. స్థిరాస్తికి సంబంధించిన వివాదాలలో విజయం సాధిస్తారు.

మీనం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. సన్నిహితులతో దీర్ఘకాలిక వివాదాలను రాజీ చేసుకుంటారు. ధనాదాయం బాగుంటుంది. వ్యాపారాలను విస్తరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది.

ఎల్‌నినో.. ఒళ్లు గుల్ల

మొదటి పేజీ తరువాయి

కారణం కాదని, వాతావరణ పరిస్థితులను మార్చడం ద్వారా ఆరోగ్య సమస్యలు పెరిగేలా చేసే ప్రమాద కారకమని డబ్ల్యూహెచ్ఓ వివరించింది. సెప్టెంబర్ 5న విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య పరిస్థితుల అంచనాలో భారత్‌ను అధిక లేదా అత్యధిక ముప్పు ఉన్న దేశంగా గుర్తించింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులకూ ఇదే తరహా ప్రమాదం ఉందని పేర్కొంది. వడగాలుల వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె, శ్వాసకోశ, మూత్రపిండాల సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉంది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, బయట పనిచేసేవారికి ముప్పు ఎక్కువ. ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు దోమల వ్యాప్తిపై ప్రభావం చూపి డెంగీ, మలేరియా కేసులు పెరిగేలా చేయవచ్చు. ముఖ్యంగా ఈశాన్య భారతంలో మలేరియా ముప్పు ఉందని నివేదిక ప్రస్తావించింది. వరదలు, పారిశుద్ధ్య సమస్యలతో తాగునీరు కలుషితమై లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. వర్షాలు తగ్గితే పంటల దిగుబడి, వ్యవసాయంపై ఆధారపడిన ఉపాధి దెబ్బతినవచ్చు. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార సమస్యలు పెరిగే అవకాశం ఉంది. తీవ్ర వాతావరణ పరిస్థితులు ఆసుపత్రులు, మందుల సరఫరాపైనా ప్రభావం చూపవచ్చు.

రుతుపవనాలపైనా ప్రభావం?

భారత వ్యవసాయం, తాగునీటి అవసరాలు రుతుపవనాలపై ఆధారపడి ఉండటంతో వర్షపాతంలో మార్పులు కీలకంగా మారనున్నాయి. 2026 ఆగస్టులో పార్లమెంటుకు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీర్ఘకాలిక సగటులో 90 శాతం వర్షాలు కురిసే అవకాశముందని, అంచనాలో నాలుగు శాతం వరకు తేడా ఉండవచ్చని పేర్కొంది. అయితే ఎల్‌నినో ఏర్పడితే రుతుపవనాలు పూర్తిగా విఫలమవుతాయని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రత, ఏర్పడే సమయం, ఇతర వాతావరణ పరిస్థితులపై వర్షపాతం ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కరవు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశాలున్నాయి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, వైకల్యాలున్నవారు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్నవారు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. పట్టణ మురికివాడలు, మారుమూల ప్రాంతాల్లో నివసించేవారికి సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం మరో సమస్య. వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు వడగాలుల బారిన పడే ప్రమాదం ఉంది. ఉపాధి కోల్పోవడం, ఆహార కొరత, వలసల వల్ల మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం పడవచ్చని



డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. వ్యాధుల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది. మందుల నిల్వలు, ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు, వాతావరణ, ఆరోగ్య, విపత్తు నిర్వహణ విభాగాల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొంది. ఎల్‌నినోతో దేశంలోని ప్రతి ప్రాంతంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందని ఈ హెచ్చరిక అర్థం కాదని, స్థానిక వాతావరణ పరిస్థితులు, ముందస్తు సన్నద్ధతను బట్టి ప్రభావం మారుతుందని స్పష్టం చేసింది.

5 కార్లున్నా క్యాబ్ రెంటల్

కనీస కార్ల సంఖ్య భారీగా తగ్గింపు

ఒకే లైసెన్స్‌తో రాష్ట్రవ్యాప్తంగా సేవలు

కేంద్రం కొత్త నిబంధనలు జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 13: దేశంలో క్యాబ్ రెంటల్ వ్యాపారాన్ని సులభతరం చేయడంతో పాటు ప్రయాణికుల భద్రతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఈ నిబంధనలతో చిన్న వ్యాపారులకు కూడా అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం క్యాబ్ రెంటల్ వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన కనీస కార్ల సంఖ్యను 50 నుంచి ఐదుకు తగ్గించారు. ఒకే లైసెన్స్‌తో రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం అంతటా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించనున్నారు. దీంతో వేర్వేరు బ్రాంచ్‌లకు ప్రత్యేక లైసెన్సులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.

లైసెన్స్ జారీ, పునరుద్ధరణ ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేయాలని ప్రతిపాదించారు. కొత్త కార్లను చేర్చడం లేదా తొలగించేందుకు 30 రోజుల్లో ఆటోమేటిక్ అనుమతులు ఇచ్చే విధానాన్ని తీసుకురానున్నారు. ప్రయాణికుల భద్రత కోసం ప్రతి క్యాబ్‌లో జీపీఎస్ లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థ, ప్రథమ చికిత్స కిట్ తప్పనిసరి చేయనున్నారు. ఆపరేటర్లు వెబ్‌సైట్‌తో పాటు 24 గంటలూ పనిచేసే ఫిర్యాదుల పరిష్కార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అత్యవసర సమయాల్లో రిపేర్, టోయింగ్ సేవలు కూడా అందించాలి. డ్రైవర్లకు పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి. సామాజిక భద్రతా చట్టం-2020 ప్రకారం వారికి ప్రయోజనాలు కల్పించాలని మంత్రిత్వ శాఖ సూచించింది. డ్రైవర్లు లేదా ఆపరేటర్లు తీవ్రమైన నేరాలకు పాల్పడితే వారి లైసెన్స్ గడువును తగ్గించేలా కఠిన నిబంధనలను కూడా ప్రతిపాదించారు. ఈ మార్పులతో చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం లభించడంతో పాటు ప్రయాణికులకు మరింత భద్రత, సేవల్లో ఎక్కువ ఎంపికలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.



ఓలాకు రూ.10 లక్షల ఫైన్

మొదటి పేజీ తరువాయి

తప్పుదోవ పట్టించే 'డార్క్ ప్యాటర్న్'గా పేర్కొంటూ రూ.10 లక్షల జరిమానా విధించింది. ఈ ఫీచర్‌ను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. ఓలా క్యాబ్ సేవలు నిర్వహించే ఏఎన్ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఈ చర్యలు తీసుకుంది. ఓలా యాప్‌లో డ్రైవర్ కోసం వెతుకుతున్న సమయంలో 'టిప్' పేరుతో అదనపు మొత్తం చెల్లించే ఆప్షన్ కనిపించేది. ఇలా డబ్బులు చెల్లిస్తే త్వరగా క్యాబ్ దొరికే అవకాశం ఉంటుందని యాప్ సూచించేది. తర్వాత కంపెనీ ఈ ఫీచర్ పేరును 'యాడ్ ఆన్'గా మార్చినా, విధానంలో మాత్రం మార్పు చేయలేదు. 'టిప్ ఇస్తే త్వరగా రైడ్ లభించే అవకాశాలు పెరగవచ్చు', 'త్వరగా రైడ్ కన్ఫర్మేషన్ కావాలంటే అదనంగా చెల్లించండి' వంటి సందేశాలను యాప్‌లో చూపించినట్లు సీసీపీఏ గుర్తించింది. డ్రైవర్ కోసం వెతుకుతున్న సమయంలోనే ఈ సందేశాలు, ముందుగా నిర్ణయించిన చెల్లింపు మొత్తాలు కనిపించేవి. దీంతో అదనంగా డబ్బులు చెల్లిస్తే క్యాబ్ త్వరగా దొరుకుతుందనే అభిప్రాయం వినియోగదారుల్లో కలుగుతోందని సంస్థ పేర్కొంది. యాడ్ ఆన్ చెల్లింపులు డ్రైవర్‌కు రైడ్ కేటాయించే విధానంపై ప్రభావం చూపవని ఓలా చెబుతున్నప్పటికీ, యాప్‌లో మాత్రం అదనపు చెల్లింపుతో త్వరగా క్యాబ్ దొరికే అవకాశాలు పెరుగుతాయని సూచించడం సరికాదని సీసీపీఏ అభ్యంతరం తెలిపింది. యాడ్ ఆన్ చెల్లింపులు ఉన్న రైడ్ అభ్యర్థనలను డ్రైవర్లు తక్కువగా అంగీకరిస్తున్నారనే సమాచారాన్ని కూడా వినియోగదారులకు వెల్లడించలేదని పేర్కొంది. సూచించిన మొత్తాలను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో వివరించలేదని తెలిపింది. ఇది వినియోగదారుల రక్షణ చట్టం-2019లోని సెక్షన్ 2(28)(4) కింద కీలక సమాచారాన్ని దాచిపెట్టినట్లేనని సీసీపీఏ తేల్చింది. సాధారణంగా సేవ పూర్తయ్యాక స్వచ్ఛందంగా ఇచ్చేదే టిప్ అని, ప్రయాణం ప్రారంభం కాకముందే దాన్ని అడగడం ద్వారా స్వచ్ఛంద చెల్లింపును ముందస్తు చెల్లింపుగా మార్చినట్లవుతుందని పేర్కొంది. ఫీచర్ పేరును 'టిప్' నుంచి 'యాడ్ ఆన్'గా మార్చినంత మాత్రాన దాని స్వభావం మారదని స్పష్టం చేసింది.

ఇన్వెస్టినేషన్.. తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రం అన్ని రకాలుగా అనుకూలమన్నారు. రాష్ట్రంలో తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించడంతో పాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలను విస్తరించేందుకు ముందుకు రావాలని కోరారు. పెట్టుబడులను పరిశ్రమలుగా, పరిశ్రమలను ఉపాధి అవకాశాలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్ రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మృత్యువే కంటైనర్!

మొదటి పేజీ తరువాయి

కోహోరా పరిధిలోని హథీకూలి టీ ఎస్టేట్ సమీపంలో రంగాజన్ వద్ద జాతీయ రహదారి-715పై ప్రయాణిస్తోంది. ఈ సమయంలో ఎదురుగా వేగంగా వస్తున్న కంటైనర్ ట్రక్కును బస్సు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రయాణికులు లోపలే ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీయడానికి తీవ్రంగా శ్రమించారు. తొలుత ఏడుగురు చనిపోయినట్లు సమాచారం వచ్చినా, సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మృతుల సంఖ్య 23కు చేరింది. ప్రమాద సమయంలో బస్సులో 27 నుంచి 35 మందికి పైగా ఉన్నట్లు అంచనా. వీరిలో కళాశాల విద్యార్థినులతో పాటు కజిరంగా హైస్కూల్ విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని కోహోరా మోడల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని జోర్హాట్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. జాతీయ పార్కు పరిసరాల్లో వేగ పరిమితిని ఉల్లంఘించి మినీ బస్సు వేగంగా వెళ్లడమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అతుల్ బోరా ప్రమాద స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.



15 మందికి 'అర్జున'

మొదటి పేజీ తరువాయి

ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్‌తో పాటు మొత్తం 15 మంది అర్జున అవార్డులు అందుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో దెకాథ్లాన్‌లో కాంస్య పతకం సాధించిన తేజస్విన్ శంకర్ ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు. ఫిడే మహిళల ప్రపంచకప్-2025 గెలిచిన తొలి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ నిలిచారు. ఫైనల్‌లో దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిపై ఆమె విజయం సాధించారు. అథ్లెట్ మహమ్మద్ అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ క్రీడాకారుడు విదిత్ గుజరాతి, హాకీ ఆటగాళ్లు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ సహా పలువురు అర్జున అవార్డులు అందుకున్నారు. జపాన్ మాస్టర్స్‌లో పాల్గొంటున్న మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ త్రీసా జాలీ, పుల్లెల గాయత్రి గోపీచంద్ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగం అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం) అందుకున్నారు. అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఛోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ద్రోణాచార్య అవార్డులు ప్రదానం చేశారు. సాహస క్రీడల్లో ప్రతిభ కనబరిచినవారికి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలు అందజేశారు. క్రీడల ప్రోత్సాహానికి కృషి చేసినందుకు పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం లభించింది. లెఫ్టినెంట్ కర్నల్ దల్జీత్ సింగ్ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు క్రీడా మంత్రిత్వ శాఖ ఆగస్టు 18న అవార్డు గ్రహీతల జాబితాను ప్రకటించింది. సాధారణంగా ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29న ఈ అవార్డులు అందజేస్తారు. అయితే ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడలు జరిగిన సంవత్సరాల్లో కార్యక్రమాన్ని వాయిదా వేస్తుంటారు. ఈ కారణంగా 2025 అవార్డులను ఏడాదికి పైగా ఆలస్యంగా ప్రదానం చేశారు.



రాహుల్.. జవాబు చెప్పు!



బీసీలకు ఇచ్చిన హామీల సంగతేంది?.. కామారెడ్డి డిక్లరేషన్‌పై స్పందనేది?

మేధావులు, సంఘాలతో చర్చలు చేపట్టాలి

బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చిరంజీవులు డిమాండ్



తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి టి. చిరంజీవులు కోరారు. నవంబర్ 14న హైదరాబాద్‌లో జరగనున్న భారత్ సమ్మిట్ 2026-తెలంగాణ రైజింగ్ సదస్సుకు హాజరుకానున్న రాహుల్ గాంధీకి ఈ మేరకు బహిరంగ లేఖ రాశారు.

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ బీసీలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి, బీసీ మేధావులు, సామాజిక సంఘాల ప్రతినిధులతో ముఖాముఖి చర్చించాలని విజ్ఞప్తి చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీ ఇంకా ఎందుకు అమలు కాలేదని లేఖలో ప్రశ్నించారు. కులగణన ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచేందుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు 2025 ఏప్రిల్ నుంచి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వాటికి ఆమోదం సాధించేందుకు కేంద్రంపై ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చారని, బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని ఎప్పుడైనా డిమాండ్ చేశారా అని రాహుల్‌ను ప్రశ్నించారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్, తెలంగాణ బీసీల విషయంలో స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. 2027 జనాభా లెక్కల్లో కులగణన సందర్భంగా బీసీలకు ప్రత్యేక కుల కాలమ్ ఏర్పాటు చేయడంతోపాటు, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కులాల పేర్లలో ప్రాంతీయ, స్పెల్లింగ్ వ్యత్యాసాల వల్ల గణాంకాల్లో గందరగోళం తలెత్తకుండా ముందుగా గుర్తించిన కులాల జాబితాతో డ్రాప్‌డౌన్ విధానం అమలు చేయాలని సూచించారు. ఈ అంశాలపై కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎందుకు గట్టిగా డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన 21 హామీల అమలుపైనా లేఖలో నిలదీశారు. ఐదేళ్లలో బీసీల అభివృద్ధికి రూ.లక్ష కోట్లు, ఏటా రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఫోరం వెల్లడించిన బడ్జెట్ వివరాల ప్రకారం.. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి సుమారు రూ.20,605 కోట్లు కేటాయించగా, 2026-27లో రూ.12,200 కోట్లు ప్రతిపాదించారని పేర్కొన్నారు. మూడు సంవత్సరాలకు కలిపి రూ.60 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, మొత్తం కేటాయింపులు సుమారు రూ.33,116 కోట్లకే పరిమితమయ్యాయని వివరించారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో వాస్తవంగా ఖర్చు చేసింది సుమారు రూ.5,143 కోట్లు మాత్రమేనని పేర్కొంటూ, కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. మిగిలిన హామీల అమలుకు కాలపట్టిక ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చొరవ చూపడం లేదని విమర్శించారు. 16 మంది సభ్యులున్న తెలంగాణ మంత్రివర్గంలో ఇద్దరే బీసీ మంత్రులు ఉన్నారని, ఖాళీగా ఉన్న నాలుగు మంత్రి పదవులను బీసీలతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో ఖాళీగా ఉన్న ఐదు స్థానాల్లో గవర్నర్ కోటా కింద భర్తీ చేయాల్సిన మూడు స్థానాలను బీసీలకు కేటాయించాలని కోరారు. కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పదవులు, ఇతర రాజకీయ నియామకాల్లోనూ బీసీల్లోని అన్ని కులాలకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, కులగణన, జనాభా ప్రాతిపదికన హక్కుల గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో తన పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై కూడా అదే చిత్తశుద్ధి చూపాలని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యటన ముగించుకుని ఢిల్లీకి వెళ్లే ముందు బీసీ మేధావులు, విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, సామాజిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, హామీల అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచే గిగ్ వర్కర్స్ పాలసీ అమలు

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పాలసీని శనివారం (నవంబర్ 14) నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు ఆరు లక్షల మంది గిగ్ వర్కర్లకు ఈ విధానం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సీఎం.. గిగ్ వర్కర్ల సమక్షంలో పాలసీని ప్రకటించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించినట్లు వెల్లడించారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్‌గాంధీ శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారని, శనివారం గిగ్ వర్కర్లతో సమావేశమవుతారని చెప్పారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత కోసం రూపొందించిన నిబంధనలు, పథకాలను రాహుల్‌గాంధీ ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది గిగ్ వర్కర్లకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని, దాని అమలుకు అవసరమైన నిబంధనలు, పథకాలను సిద్ధం చేసిందని సీఎం తెలిపారు.

జనసేన నేత పేరు చెప్పి రూ.7 కోట్ల మోసం

మంగళగిరి, నవంబర్ 13 (ఈవార్తలు): జనసేన నేత కల్యాణ శివ శ్రీనివాసరావు పేరు చెప్పి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి సుమారు రూ.7 కోట్లు వసూలు చేసిన కేసులో ధరణి కృష్ణ అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ వాట్సాప్ ఖాతాలు, ఆడియో కాల్స్, అపాయింట్‌మెంట్ లెటర్లతో ఆమె మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన ధరణి కృష్ణ గతంలో మంగళగిరిలోని కైరెన్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో పనిచేసేది. ఆ సమయంలో కల్యాణ శివ శ్రీనివాసరావు తనకు స్వయానా బాబాయి అని చెప్పి నిరుద్యోగులను నమ్మించింది. ఆయన పలుకుబడితో దేవాదాయ, పోలీసు శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఏలూరు జిల్లాలో 16 మంది, తణుకులో 20 మంది నుంచి దాదాపు రూ.7 కోట్లు వసూలు చేసింది. తాము చెల్లించిన డబ్బుకు పార్టీ నేతే పూచీ అని నమ్మించింది. బాధితులకు అనుమానం రాకుండా శివ శ్రీనివాసరావు ఫొటోతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్స్ సృష్టించింది. ఫేక్ ఆడియో కాల్స్ ద్వారా ఆయన మాట్లాడుతున్నట్లు నమ్మించేది. ప్రభుత్వ ముద్రలు, అధికారుల సంతకాలతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లను తయారు చేసి ఇచ్చింది. తాను పనిచేస్తున్న కైరెన్ కన్సల్టెన్సీ, ఆ సంస్థ సీఈవో కోట రుక్మిణి పేర్లను కూడా దుర్వినియోగం చేసింది. నలుగురు బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున తిరిగి చెల్లించినట్లు నకిలీ బిల్లులు, రసీదులు సృష్టించింది. నవంబర్ 5న తరుణ్ అనే బాధితుడు శివ శ్రీనివాసరావును నేరుగా కలిసి నిలదీయడంతో ఈ వ్యవహారం బయటపడింది. బాధితుడు చూపించిన నకిలీ పత్రాలు, వాట్సాప్ స్క్రీన్‌షాట్లను పరిశీలించిన ఆయన కన్సల్టెన్సీ సీఈవోను అప్రమత్తం చేశారు. దీంతో కంపెనీ యాజమాన్యం నవంబర్ 9న ధరణి కృష్ణకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. నిమ్మకాయల పెద్దిరాజు ప్రోద్బలంతోనే తాను మధ్యవర్తిగా వ్యవహరించినట్లు ఆమె లిఖితపూర్వకంగా అంగీకరించడంతో సంస్థ నుంచి తొలగించారు. ఈ మోసంపై కల్యాణ శివ శ్రీనివాసరావు, కన్సల్టెన్సీ సీఈవో కోట రుక్మిణి వేర్వేరుగా మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ధరణి కృష్ణతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తెలంగాణ జైళ్ల శాఖకు ఒకేసారి ఆరు ఐఎస్ఓ సర్టిఫికెట్లు

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ జైళ్ల శాఖకు అరుదైన గుర్తింపు లభించింది. చర్లపల్లి సెంట్రల్ జైలు, చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా) సంస్థలు కలిపి ఆరు అంతర్జాతీయ ఐఎస్ఓ సర్టిఫికెట్లు సాధించాయి. భారత జైళ్ల చరిత్రలో ఒక రాష్ట్ర కారాగారాల శాఖకు ఒకేసారి ఇన్ని గుర్తింపులు రావడం ఇదే తొలిసారని డెక్కన్ క్రానికల్ కథనం పేర్కొంది. ప్రపంచ నాణ్యతా వారోత్సవాలు (నవంబర్ 9 నుంచి 13 వరకు) సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ సర్టిఫికెట్లను అధికారులకు అందజేశారు. చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్, చంచల్‌గూడ సికా ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరెడ్డి ధ్రువపత్రాలను స్వీకరించారు.

చర్లపల్లి సెంట్రల్ జైలుకు నాలుగు సర్టిఫికెట్లు లభించాయి. అవి:

1. ఐఎస్ఓ 9001 -- నాణ్యత నిర్వహణ వ్యవస్థ
2. ఐఎస్ఓ 14001 -- పర్యావరణ నిర్వహణ వ్యవస్థ
3. ఐఎస్ఓ 50001 -- ఇంధన నిర్వహణ వ్యవస్థ
4. ఐఎస్ఓ 22000 -- ఆహార భద్రత నిర్వహణ వ్యవస్థ

చంచల్‌గూడ సికాకు రెండు సర్టిఫికెట్లు వచ్చాయి.



తెలంగాణలో 918 నక్సల్స్ లొంగుబాటు

వామపక్ష తీవ్రవాద అడ్డుకట్టకు చర్యలు

నక్సల్స్ రహిత భారత్ దిశగా అడుగులు

భద్రాద్రి కొత్తగూడెం వార్తాలాప్‌లో వక్తలు

కొత్తగూడెం, నవంబర్ 13 (పీఐబీ): వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, నక్సల్స్ లొంగుబాటు, పునరావాస కార్యక్రమాలపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వార్తాలాప్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు విభాగం, తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ విభాగం సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వం, మీడియా మధ్య సమన్వయాన్ని పెంచడంలో వార్తాలాప్ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని చెప్పారు. ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ తెలంగాణలో వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. నక్సలిజం చరిత్ర, దాని వల్ల జరిగిన హింస, అభివృద్ధిపై పడిన ప్రభావాన్ని వివరించారు. తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు పోలీసులు అనుసరిస్తున్న వ్యూహాలు, పోలీసు సిబ్బంది చేసిన త్యాగాలు, మావోయిస్టుల లొంగుబాటు, వారికి అందిస్తున్న పునరావాస సాయం గురించి తెలిపారు. మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలు, యువత, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు, అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు మాట్లాడుతూ వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలో పోలీసుల కృషితో పాటు, ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెలంగాణలో 2014 నుంచి 2026 మధ్య 829 మంది అరెస్టు కాగా, 918 మంది నక్సల్స్ లొంగిపోయారని తెలిపారు. మారుమూల, గతంలో తీవ్రవాద ప్రభావానికి గురైన ప్రాంతాల్లో సంచార వైద్య సేవలు, వైద్య శిబిరాలు, రహదారులు, సోలార్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పాఠశాలలు, క్రీడా సదుపాయాలు, కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వరరావు, పీఐబీ హైదరాబాద్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ వర్గంటి గాయత్రి, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు సుమారు 100 మంది హాజరయ్యారు.

గడువులోగా ఫ్లాట్లు అప్పగించని బిల్డర్లపై రెరా చర్యలు

10.85 శాతం వార్షిక వడ్డీతో రూ.60.22 లక్షలు తిరిగి చెల్లించాలని ఆదేశం

మరో సంస్థకు రూ.20.05 లక్షల జరిమానా



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): ఇళ్ల కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని నాలుగు రియల్ ఎస్టేట్ సంస్థలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (టీజీ-రెరా) చర్యలు చేపట్టింది. ఇద్దరు బిల్డర్లు బాధితులకు మొత్తం రూ.60.22 లక్షలను 10.85 శాతం వార్షిక వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశించింది. మరో సంస్థకు రూ.20.05 లక్షల జరిమానా విధించింది. నాలుగో సంస్థపై జరిమానా విధించే ప్రక్రియ ప్రారంభించింది. నవంబర్ 10న జారీ చేసిన నాలుగు వేర్వేరు ఉత్తర్వుల్లో ఈ నిర్ణయాలు వెల్లడించింది. భువన్ తేజా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన హ్యాపీ హోమ్స్ ఫేజ్-2 ప్రాజెక్టులో వినుకొండ రవి 2021 అక్టోబర్‌లో ఫ్లాట్ కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. ఫ్లాట్ ధరను రూ.20.79 లక్షలుగా నిర్ణయించారు. 36 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తామని, అదనంగా ఆరు నెలల గడువు ఉంటుందని సంస్థ హామీ ఇచ్చింది. కొవిడ్ కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందని చెబుతూ ఫేజ్-1లో మరో ఫ్లాట్ తీసుకోవాలని సంస్థ సూచించింది. ఇందుకోసం అదనంగా రూ.1.43 లక్షలు వసూలు చేసింది. మొత్తంగా రూ.22.22 లక్షలు తీసుకున్నా నిర్మాణం ప్రారంభించలేదు. ఫ్లాట్‌ను కూడా అప్పగించలేదు. ఈ ప్రాజెక్టుకు రెరా నమోదు, అవసరమైన అనుమతులు లేవని గుర్తించిన అధికారులు.. కొనుగోలుదారుడికి మొత్తం సొమ్మును 10.85 శాతం వార్షిక వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశించారు. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వెస్ట్రన్ వేవ్స్ ప్రాజెక్టులో ముగ్గురు పెట్టుబడిదారులు రూ.38 లక్షలు చెల్లించారు. నానక్‌రామ్‌గూడలోని ఈ ప్రాజెక్టులో 500 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణం ఉన్న సెమీ ఫినిష్డ్ వాణిజ్య యూనిట్‌తో పాటు 11.5 చదరపు గజాల అవిభాజ్య భూమి వాటా ఇస్తామని సంస్థ ఒప్పందం చేసుకుంది. 2024 డిసెంబర్‌లోగా యూనిట్‌ను అప్పగిస్తామని హామీ ఇచ్చినా ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టుకు కూడా రెరా నమోదు లేదని అధికారులు గుర్తించారు. గతంలో ఇదే సంస్థ, ప్రాజెక్టుపై వచ్చిన మరో ఫిర్యాదులో రూ.5 లక్షల జరిమానా విధించడంతో పాటు డబ్బు తిరిగి చెల్లించాలని ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు. తాజాగా ముగ్గురు పెట్టుబడిదారులకు రూ.38 లక్షలను 10.85 శాతం వార్షిక వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశించారు. మోదీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గోల్డెన్ కౌంటీ ప్రాజెక్టుపై విల్లాల యజమానులు, వారి సంఘం ఫిర్యాదు చేశారు. కీసర మండలం రాంపల్లి దాయరాలోని ఈ ప్రాజెక్టులో క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్, క్రీడా సదుపాయాలు, పార్కులు కల్పిస్తామని సంస్థ ప్రచారం చేసింది. అయితే 2021లోనే నివాసాలు ప్రారంభమైనప్పటికీ చాలా సదుపాయాలు అసంపూర్తిగా ఉన్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. 2019 నుంచి 2023 మధ్య ఒక్కొక్కరి నుంచి క్లబ్‌హౌస్, ఇతర వసతుల కోసం రూ.5 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు హెచ్ఎండీఏ అనుమతి, రెరా నమోదు ప్లాట్ల అభివృద్ధి కోసం మాత్రమే తీసుకున్నారని, కానీ సంస్థ విల్లాల ప్రాజెక్టుగా ప్రచారం చేసిందని టీజీ-రెరా గుర్తించింది. నిబంధనల ఉల్లంఘనపై రూ.20.05 లక్షల జరిమానా విధించింది. స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన స్టార్‌లైట్ సెరెనా ప్రాజెక్టుపైనా టీజీ-రెరా చర్యలు ప్రారంభించింది. కొండాపూర్‌లోని తమ భూమిలో కొంత భాగాన్ని కలుపుకుని ప్రాజెక్టును అభివృద్ధి చేసి ప్రచారం చేస్తున్నారని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఫిర్యాదు చేశారు. ఈ భూమిపై ఇప్పటికే సివిల్ కోర్టుల్లో యాజమాన్య వివాదాలు కొనసాగుతున్నాయి. రెరా చట్టంలోని సెక్షన్ 3(1)ను ఉల్లంఘిస్తూ నమోదు చేయని ప్రాజెక్టును ప్రచారం చేసినట్లు సంస్థ గుర్తించింది. సెక్షన్ 59 ప్రకారం జరిమానా విధించే ప్రక్రియ ప్రారంభించాలని కార్యదర్శిని ఆదేశించింది.

మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



బంగాళాఖాతంలో తుపాను ముప్పు.. 'అక్వాన్'గా నామకరణం

విశాఖపట్నం, నవంబర్ 13 (ఈవార్తలు): బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది బలపడి తుపానుగా మారితే 'అక్వాన్' అని పేరు పెట్టనున్నారు. ఈ పేరును ఇరాన్ సూచించింది. ఇరాన్ పురాణాల్లో 'అక్వాన్' అంటే దుష్ట మనస్సు అని అర్థం. ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా ప్రకారం.. ఈ అల్పపీడనం నవంబర్ 14 నాటికి తీవ్ర అల్పపీడనంగా, 15 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, ఇతర వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే నవంబర్ 18 నాటికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ గత రెండు తుపానుల కంటే భిన్నమైన మార్గంలో పయనించే సూచనలు కనిపిస్తున్నాయి. తాజా అంచనాల ప్రకారం.. ఏపీ, తమిళనాడు తీరాలకు దూరంగా సముద్రంలోనే దిశ మార్చుకుని ఉత్తర దిశగా వెళ్లే అవకాశం ఉంది. అదే జరిగితే పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాలపై ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. శనివారం నాటికి వాయుగుండంగా మారిన తర్వాత దీని గమనం, తీరం దాటే ప్రాంతంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వేధింపులు భరించలేక మహిళా క్రికెటర్ ఆత్మహత్య

వికారాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): వర్ధమాన మహిళా క్రికెటర్ నందిని (17) ఆత్మహత్య చేసుకోవడం వికారాబాద్‌లో విషాదం నింపింది. బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికైన ఆమె శుక్రవారం ప్రాణాలు తీసుకుంది. ఇద్దరు యువకుల వేధింపులే ఈ ఘటనకు కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రతిభావంతురాలైన క్రీడాకారిణి అర్ధాంతరంగా మృతి చెందడంతో స్థానిక క్రీడా వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. యాలాల మండలం సంగయ్యపల్లి గ్రామానికి చెందిన నందిని క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో వికారాబాద్‌కు వచ్చింది. మధు కాలనీ సమీపంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ రోజూ క్రికెట్ కోచింగ్ తీసుకునేది. ఆమె ప్రతిభను గుర్తించిన బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపిక చేసింది. త్వరలోనే ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్, కృష్ణ అనే ఇద్దరు యువకులు కొంతకాలంగా నందినిని వేధిస్తున్నారు. వారిలో ఒకరు ప్రేమ పేరుతో వేధించగా, మరొకరు అతనికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన నందిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



రాయికల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాయికల్, నవంబర్ 13 (ఈవార్తలు): రోడ్డును ఆక్రమించి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని 9వ వార్డు ఇటిక్యాల రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రహరీ, మెట్లను అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు ఆక్రమణలను తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే నిర్మాణాలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, టౌన్ ప్లానింగ్ అధికారి సూర్యతేజ, ఆర్‌అండ్‌బీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకున్న అడువాల జ్యోతి



హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేసి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంతో పాటు మహిళలను రాజకీయంగా చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా

నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పథకం అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని భట్టి విక్రమార్క తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయసున్న కుటుంబ సంపాదన సభ్యుడికి రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించనున్నట్లు చెప్పారు. నవంబర్ 14 నుంచి పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రతి గ్రామం, పట్టణ వార్డులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ దరఖాస్తులు, నామినీ వివరాలను కచ్చితంగా నమోదు చేసి డిజిటలైజ్ చేయాలని సూచించారు. 15 నుంచి 20 రోజుల్లో అన్ని కుటుంబాల వివరాల సేకరణ పూర్తి చేయాలని, బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో జీవన్‌రెడ్డి

జగిత్యాల రూరల్, నవంబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లె గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొల్లపల్లె గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కుమ్మరిపల్లి మోడల్ స్కూల్‌కు ఎంపీ రూ.10 లక్షల సాయం

వెల్గటూర్, నవంబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాల అభివృద్ధికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రూ.10 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల అవసరాల కోసం విశాఖ చారిటీ ట్రస్ట్ ద్వారా 50 బెంచీలు అందజేశారు. మరో 50 బెంచీలు కూడా పంపిణీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంపీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతి గదులను పరిశీలించారు. ఆడపిల్లల భద్రత కోసం స్టన్ గన్ రూపొందించిన సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి వెంకటేష్‌ను అభినందించి రూ.25 వేల ప్రోత్సాహకం అందించారు. పాఠశాలలో 760 మంది విద్యార్థులు చదువుతుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సందీప్ రాజ్, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, మండల విద్యాధికారి, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాగృతి కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

హైదరాబాద్, నవంబర్ 13 (ఈవార్తలు): జాగృతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై. జహంగీర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. కొత్త సాంకేతికతను తమ భవిష్యత్తు అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. మానవ జీవితం విశ్రమించడానికి కాదని, నిరంతరం శ్రమించి ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కామర్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి విజ్ఞానాన్ని పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. సెక్రటరీ శశికిరణ్ రెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాల అభివృద్ధి కోసం కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. త్వరలో పలు బహుళజాతి సంస్థలు క్యాంపస్ ఎంపికల కోసం కళాశాలకు రానున్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ జోసెఫిన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్ మాట్లాడుతూ విద్యా, వాణిజ్య రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బీఎస్సీ ఇన్‌చార్జి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉంటూ కొత్త విషయాలు నేర్చుకోవాలని చెప్పారు. విద్యార్థులు



ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ర్యాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు రెబెకా యాస్మీన్, అధ్యాపక బృందం, అడ్మిన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 29 వరకు అంజన్న నిజరూప దర్శనం

రేపటి నుంచి 20 వరకు చందనోత్సవం, మహాసంప్రోక్షణ

మల్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో సుమారు 60 ఏళ్ల తర్వాత స్వామివారి సింధూర లేపనాన్ని తొలగించి చందనోత్సవం, మహాసంప్రోక్షణ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. స్వయంభూ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన కొండగట్టు అంజన్న ఆలయంలో సంప్రదాయం ప్రకారం ప్రతి మంగళవారం, శనివారం స్వామివారికి సింధూర లేపనం చేస్తారు. ఇప్పుడు ఆలయ ఆచారాలకు అనుగుణంగా సుమారు ఆరు దశాబ్దాల తర్వాత సింధూరాన్ని తొలగించి చందనోత్సాదనం, మహాసంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఆరు రోజుల పాటు వేద మంత్రోచ్చారణల మధ్య హోమాలు, జపాలు, పారాయణాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఇద్దరు జీయర్ స్వాముల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర సంప్రదాయాల ప్రకారం మహాసంప్రోక్షణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నారు.

ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు



నవంబర్ 15న ఆదివారం స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం స్వామివారి సింధూరం తొలగిస్తారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, అంకురార్పణ, యాగశాలకు సంబంధించిన పూజలు నిర్వహిస్తారు. నవంబర్ 16 నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక ఆరాధనలు, వేద పారాయణాలు, మూలమంత్ర హోమాలు, పంచగవ్య స్నపనం, పూర్ణాహుతి, బలిప్రదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయి. నవంబర్ 19న జీయర్ స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతారు. నవంబర్ 20న శాంతి హోమాలు, మహా పూర్ణాహుతి అనంతరం మహా కుంభ సంప్రోక్షణ నిర్వహిస్తారు. జీయర్ స్వాములకు ఆలయ మర్యాదలు, ఆచార్యులు, ఋత్విక్కులకు సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

40 రోజుల పాటు నిజరూప దర్శనం

నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు సుమారు 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నారు. డిసెంబర్ 29న మండలాభిషేకం నిర్వహించి తొలి విడత చందన లేపనం సమర్పిస్తారు. ఆ తర్వాత యథావిధిగా ప్రతి మంగళవారం, శనివారం స్వామివారికి చందనం సమర్పించే సంప్రదాయం కొనసాగుతుంది. సుమారు 60 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ ప్రత్యేక ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కోరారు.

మానస స్కూల్‌లో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు



జగిత్యాల టౌన్, నవంబర్ 13 (ఈవార్తలు): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జగిత్యాలలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా పలు విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాల్ మ్యాగజైన్, ఆర్ట్ ఎగ్జిబిషన్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు, గణితానికి సంబంధించిన సృజనాత్మక కార్యక్రమాలు, విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను, ఆలోచనా నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సందేశాత్మక నాటికలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రజితా రావు మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, సంస్కృతి, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు ఆచరణాత్మక అనుభవం, సృజనాత్మక ఆలోచనలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ రావు, హరిచరణ్, ప్రధానోపాధ్యాయురాలు రజితా రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు

జగిత్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): కార్తిక మాసం నాగుల చవితి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా నాగేంద్రుడికి పాలాభిషేకం చేశారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించి, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కుంకుమ పూజ తర్వాత లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి, వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, తాంబూలం అందజేశారు. ఆలయ పూజారి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం అమ్మవారికి ముడుపులు కట్టారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, త్రివేణి, సునీత, రజిత, ప్రసన్న, సంధ్యారాణి, జ్యోతి, లక్ష్మి, మంజుల, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు కిడ్స్ కాన్వెంట్ విద్యార్థినులు

వేములవాడ అర్బన్, నవంబర్ 13: రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో నిర్వహించిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో కిడ్స్ కాన్వెంట్ విద్యార్థులు నాలుగు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు బి. మధుప్రియ, కె. అవంతిక రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి పోటీల్లో మొత్తం 76 ప్రాజెక్టులు పాల్గొనగా, వాటిలో తమ పాఠశాల విద్యార్థినుల ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షణ్ వస్పియ, డైరెక్టర్ హసన్ ఫసి ఉల్లాహ్ విద్యార్థినులను అభినందించారు. వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు విజ్ఞానశాస్త్ర రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



గడి బురుజు భూమిపై వీఎల్‌టీ రద్దు చేయాలి

మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు ఎమ్మెల్యే సంజయ్ వినతి

కోరుట్ల, నవంబర్ 13 (ఈవార్తలు): కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడి బురుజు భూమిపై మున్సిపాలిటీ విధించిన ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ)ను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత, కమిషనర్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడి బురుజు భూమి పట్టణానికి చెందిన విలువైన ప్రజా ఆస్తి అని, చారిత్రకంగా, ప్రజాపరంగా దానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అలాంటి భూమిపై వీఎల్‌టీ విధించడంపై ప్రజల్లో ఆందోళన, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. వచ్చే మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని ఎజెండాలో చేర్చి, వీఎల్‌టీ రద్దు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గడి బురుజు భూమిని కాపాడాలని, స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



శాస్త్రీయ సాగుతో రైతులకు ఆదాయం

నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలి

రైతు సదస్సులో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబర్ 13 (ఈవార్తలు): శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో శుక్రవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వేములవాడ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, బాబు జగ్జీవన్ రామ్ సిరిసిల్ల, పొలాస వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను ఆది శ్రీనివాస్ సందర్శించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొత్త సాగు విధానాలు, పంటల మార్పిడి, నేల సార పరీక్షలు, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, పశువైద్య విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో రైతులకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్న విద్యార్థులను అభినందించారు. నేల స్వభావం, సారాన్ని పరిశీలించి ఏ భూమిలో ఏ పంట సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందో వారికి వివరించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందుగానే పంటల సాగుపై ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. నేల సార పరీక్షలు, శాస్త్రీయ పద్ధతుల్లో పంటల ఎంపిక, పంటల మార్పిడి, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి జిల్లాలో రైతు విద్యా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ పరిశోధనలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా వివరించారు. విద్యార్థులు కళాశాలల్లో నేర్చుకున్న విషయాలతో పాటు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి పొందిన అనుభవాన్ని భవిష్యత్తులో ఉపయోగించుకుని వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆది శ్రీనివాస్ సూచించారు.



లింగ నిర్ధారణ
పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

జగిత్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప వైద్యాధికారి, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అల్ట్రాసౌండ్ యంత్రాలు, వైద్యుల అర్హత పత్రాలు, కేంద్రాల అనుమతులను పరిశీలించారు. ప్రతి నెల ఐదో తేదీలోపు ఫారం-ఎఫ్ వివరాలను సంబంధిత పీహెచ్‌సీలో సమర్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డుల్లో ఒకే విధమైన వివరాలు ఉండాలని సూచించారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధమని తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, జైలు శిక్షతో పాటు వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు చేసే వరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌చార్జి డెమో ఏనుగంటి రాజేశం, జూనియర్ అసిస్టెంట్ వి. సాగర్ పాల్గొన్నారు.



19 కిలోల గంజాయి దహనం

జగిత్యాల, నవంబర్ 13 (ఈవార్తలు): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 47 కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు 19 కిలోల గంజాయిని శుక్రవారం దహనం చేశారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో ధ్వంసం చేసిన గంజాయి విలువ సుమారు రూ. 9.50 లక్షలు ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనలు, పర్యావరణ కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రత్యేక యంత్రం ద్వారా గంజాయిని దహనం చేసినట్లు చెప్పారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్‌గా ఎస్పీ అశోక్ కుమార్ వ్యవహరించగా, సభ్యులుగా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయాలు, రవాణా ద్వారా యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్నారని అన్నారు. ఇలాంటి కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కాలుష్యం.. 403 ఏక్యూఐ

న్యూఢిల్లీ, నవంబర్ 13 : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. పాకిస్థాన్‌లోని లాహోర్‌ను దాటి ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచింది. నగరమంతా దట్టమైన పొగమంచు (స్మాగ్) కమ్ముకోవడంతో గాలి నాణ్యత పడిపోయింది. ప్రజలు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థ ఐక్యూఎయిర్ తాజా లెక్కల ప్రకారం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 334గా నమోదైంది. ఇది ప్రమాదకర స్థాయి. మరోవైపు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) లెక్కల్లో ఏక్యూఐ 403గా నమోదైంది. ఈ స్థాయిని 'తీవ్రమైనది'గా పేర్కొంది. రెండు సంస్థలు వేర్వేరు పద్ధతుల్లో గాలి నాణ్యతను లెక్కించడం వల్ల ఈ తేడా కనిపిస్తోంది. సాధారణంగా ఏక్యూఐ 50 లోపు ఉంటేనే గాలి నాణ్యత ఆరోగ్యకరంగా ఉన్నట్లు భావిస్తారు. దాదాపు రెండు కోట్లకు పైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతం పొగమంచులో చిక్కుకుంది. రోడ్లపై దృశ్యమానత తగ్గిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు కూడా కనిపించనంతగా పొగమంచు కమ్ముకుంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు అధికారులు కీలక ప్రాంతాల్లో మిస్ట్ స్ప్రేయింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి నీటిని పిచికారీ చేస్తున్నారు. ఉత్తర భారతదేశం, పాకిస్థాన్‌లో శీతాకాలం ప్రారంభంలో ఇలాంటి పరిస్థితులు తరచూ కనిపిస్తుంటాయి. చల్లటి గాలులు భూమికి దగ్గరగా ఉండిపోవడంతో వాహనాల పొగ, నిర్మాణ రంగం నుంచి వచ్చే దుమ్ము, పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల వెలువడే పొగ వాతావరణంలోనే నిలిచిపోతుంది. దీంతో గాలి నాణ్యత మరింత దిగజారుతోంది.

నా ఫోన్‌ను
మోదీ ట్యాప్ చేస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ, నవంబర్ 13 : తన ఫోన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విదేశీ శక్తుల సాయంతో దేశంలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు ఆయన ఈ వ్యాఖ్యలతో బదులిచ్చారు. తన ఫోన్‌లోనే ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రాహుల్ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు రావాలన్న సవాలును మరోసారి పునరుద్ఘాటించారు. చర్చ జరిగితే ఎవరు విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకి? అన్నది బయటపడుతుందని అన్నారు. అలాంటి చర్చ జరిగితే ప్రధాని రాజకీయ జీవితం ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు. తాను ప్రసంగాల రూపంలో సాగే చర్చను కోరుకోవడం లేదని, ఇద్దరి మధ్య నేరుగా చర్చ జరగాలని స్పష్టం చేశారు. పార్లమెంటులో మాట్లాడేందుకు ప్రయత్నించినా తన మైక్ నిలిపివేస్తున్నారని, అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతు చట్టాలు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్, చైనా అంశాలపై మాట్లాడేందుకు అవకాశం రాలేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో చర్చకు రావాలంటూ చేసిన సవాలుపై స్పందిస్తూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని తన ఏసీ గది నుంచి బయటకు వచ్చి సామాన్యులు పీల్చే గాలిని పీల్చాలని అన్నారు. మోదీ తనపై గతంలో మాదిరిగా విమర్శలు చేయకుండా ఆచితూచి మాట్లాడుతున్నారని, అందుకు ఆయన మనసులో ఉన్న భయమే కారణమని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఇస్రో బడ్జెట్ కంటే జీటీఏ-6 వారం వసూళ్లే అధికం

48 వేల కోట్ల వరకు అమ్మకాలు ఉంటాయని న్యూజూ అంచనా



న్యూఢిల్లీ, నవంబర్ 13 : ప్రపంచవ్యాప్తంగా వీడియో గేమింగ్ ప్రియులు ఎదురుచూస్తున్న 'గ్రాండ్ తెఫ్ట్ ఆటో-6' (జీటీఏ-6) విడుదలకు సిద్ధమైంది. ఈ గేమ్ విడుదలైన తొలి వారంలోనే 3.25 బిలియన్ డాలర్ల నుంచి 5.2 బిలియన్ డాలర్ల వరకు అమ్మకాలు సాధించవచ్చని మార్కెట్ రీసెర్చ్ సంస్థ న్యూజూ అంచనా వేసింది. భారత కరెన్సీలో ఈ మొత్తం సుమారు రూ. 30,574 కోట్ల నుంచి రూ. 48,918 కోట్ల వరకు ఉంటుంది. ప్రముఖ మీడియా సంస్థ 'వెరైటీ' ఈ వివరాలను వెల్లడించింది. ఈ అంచనాలు నిజమైతే వినోద రంగంలోనే భారీ రికార్డుగా నిలవనుంది. భారత్ ఇస్రోకు కేటాయించిన వార్షిక బడ్జెట్ సుమారు రూ. 13,705 కోట్లు. జీటీఏ-6 తొలి వారంలో వచ్చే గరిష్ఠ ఆదాయం ఇస్రో బడ్జెట్‌కు దాదాపు 3.6 రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఈ గేమ్ నవంబర్ 19న ప్లేస్టేషన్-5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ కన్సోళ్లపై విడుదల కానుంది. జీటీఏ-5 విడుదలై దాదాపు 13 ఏళ్ల తర్వాత వస్తున్న సీక్వెల్ కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. అమెరికాలోని ఫ్లోరిడాను పోలిన కల్పిత 'లియోనిడా' ప్రాంతం నేపథ్యంలో కథ సాగుతుంది. నేరగాళ్ల జంట బోనీ అండ్ క్లైడ్ తరహాలో లూసియా కామినోస్, జాసన్ డువాల్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ గేమ్ తయారీకి 1 బిలియన్ నుంచి 1.5 బిలియన్ డాలర్ల వరకు ఖర్చయి ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే రాక్‌స్టార్ సంస్థ ఈ వ్యయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ప్రీ-ఆర్డర్లలోనూ జీటీఏ-6 దూసుకెళ్తోంది. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారిలో 89 శాతం మంది 100 డాలర్ల అల్టిమేట్ ఎడిషన్‌ను ఎంచుకోగా, 11 శాతం మంది మాత్రమే 80 డాలర్ల స్టాండర్డ్ ఎడిషన్‌ను కొనుగోలు చేశారు. డిజిటల్ ప్రీ-ఆర్డర్లలో ప్లేస్టేషన్-5 వాటా 75 శాతం, ఎక్స్‌బాక్స్ వాటా 25 శాతంగా ఉంది. నవంబర్ 10 నుంచే ప్రీ-డౌన్‌లోడ్స్ ప్రారంభమయ్యాయి. ప్రస్తుత తరం కన్సోళ్లలో ఈ గేమ్ 30 ఎఫ్‌పీఎస్ సామర్థ్యంతో పనిచేయనుంది. ప్లేస్టేషన్-5 ప్రోలో మరింత మెరుగైన గ్రాఫిక్స్, రే ట్రేసింగ్ షాడోలు అందుబాటులో ఉండనున్నాయి.

కలెక్టర్ల కార్లు జప్తు!

46 ఏళ్లుగా పరిహారం చెల్లించలేదు.. తీవ్రంగా పరిగణించిన కోర్టు.. బాధితులను ఆదుకోవాలని హుకుం

పతనంతిట్ట, నవంబర్ 13 : వంతెన నిర్మాణం కోసం 1980లో సేకరించిన భూమికి పరిహారం చెల్లించకపోవడంతో కేరళలోని కోర్టు ఇద్దరు అదనపు జిల్లా కలెక్టర్ల అధికారిక కార్లను జప్తు చేసింది. పలుమార్లు ఆదేశించినా అధికారులు పరిహారం చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకుంది. ఎనాత్‌కు చెందిన మురళీధరన్ భూమిని 1980లో వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించింది. అయితే ఇప్పటివరకు పరిహారం అందలేదు. దీంతో ఆయన 1995లో పతనంతిట్ట సబ్‌కోర్టును ఆశ్రయించారు. 2008లో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ 2009లో మరోసారి కోర్టును ఆశ్రయించారు. కొల్లాం రోడ్స్ డివిజన్ ప్రజాపనుల శాఖకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా పరిహారం చెల్లించలేదు. నిధుల కొరతతో మొత్తం చెల్లించలేకపోతున్నట్లు అధికారులు చెప్పినట్లు సమాచారం. వడ్డీతో కలిపి మురళీధరన్‌కు చెల్లించాల్సిన మొత్తం రూ. 12,60,361గా అధికారులు లెక్కించారు.



ఈ మొత్తాన్ని వసూలు చేసేందుకు కోర్టు అమలు చర్యల్లో భాగంగా పతనంతిట్ట, శబరిమల అదనపు జిల్లా కలెక్టర్ల అధికారిక వాహనాలను జప్తు చేసింది. 2016, 2014 మోడళ్ల టయోటా ఇన్నోవా కార్లకు నోటీసులు అంటించి కోర్టు ప్రాంగణానికి తరలించారు. బకాయి చెల్లించకపోతే వాహనాలను వేలం వేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ నిజాముద్దీన్ మాట్లాడుతూ.. అదనపు కలెక్టర్లకు ప్రత్యామ్నాయ వాహనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కోర్టు ఆదేశించిన మొత్తాన్ని జమ చేసిన తర్వాత జప్తు చేసిన కార్లను విడిపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి జప్తుల వల్ల శాఖల సాధారణ కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు.

ఫోన్ ట్యాపింగ్ ఆధారాలుంటే బయటపెట్టు

రాహుల్ ఫోన్ ట్యాప్ ఆరోపణలపై బీజేపీ ఎదురుదాడి

న్యూఢిల్లీ, నవంబర్ 13 : తన ఫోన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ట్యాప్ చేయిస్తున్నారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలను నిరాధారమైనవిగా కొట్టిపారేశారు. ఫోన్ ట్యాప్ అవుతోందని చెబుతున్నప్పుడు అందుకు ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీతో చర్చ జరగాలని కోరుతూనే మరోవైపు ఇలాంటి ఆరోపణలు చేయడం రాహుల్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బీజేపీ నేతలు విమర్శించారు. మోదీతో జరగాల్సిన చర్చలో ఏ అంశాలు ఉండాలనే దానిపై రాహుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో నెటిజన్ల నుంచి సూచనలు కోరారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన ఫోన్‌ను ప్రధాని ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ స్పందిస్తూ..



రాహుల్ గతంలో చేసిన ఆరోపణలకు, ఇప్పటి వ్యాఖ్యలకు ఆధారాలు లేవన్నారు. పార్లమెంటులో చర్చకు కాంగ్రెస్ నేతలు ముందుకు రావడం లేదని విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ మాట్లాడుతూ.. వార్తల్లో నిలవడానికే రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఫోన్ నిజంగానే ట్యాప్ అవుతోందని భావిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి, ఫోన్‌ను విచారణకు ఇవ్వాలని సూచించారు. ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య రాహుల్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆయన ఆలోచనలను విదేశీయులు హ్యాక్ చేశారని, ఫోన్‌ను హ్యాక్ చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు నళిన్ కోహ్లీ, తుహిన్ సిన్హా కూడా రాహుల్ ఆరోపణలను తప్పుబట్టారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు రాహుల్‌కు మద్దతుగా నిలిచారు. ప్రతిపక్ష నేత ఫోన్ ట్యాప్ అవుతోందని చెప్పుకోవాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ అన్నారు. మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్ రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలని కోరారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ.. రాహుల్ ఆరోపణలతో బీజేపీ నేతల్లో ఆందోళన మొదలైందని వ్యాఖ్యానించారు.

20 పార్కింగ్ రుసుము వసూలు!

రూ.13 వేల పరిహారం చెల్లించాలని రైల్వే శాఖకు ఆదేశం

చెన్నై, నవంబర్ 13 : రైల్వే స్టేషన్ వద్ద కుటుంబ సభ్యులను తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ యువకుడి నుంచి అక్రమంగా రూ. 20 పార్కింగ్ రుసుము వసూలు చేసినందుకు రైల్వే శాఖ, పార్కింగ్ కాంట్రాక్టర్‌కు తమిళనాడు వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. బాధితుడికి రూ. 20 తిరిగి చెల్లించడంతో పాటు, మానసిక వేదనకు రూ. 10 వేలు, న్యాయపోరాటం ఖర్చుల కింద రూ. 3 వేలు కలిపి మొత్తం రూ. 13 వేలు పరిహారంగా ఇవ్వాలని ఆదేశించింది. గతేడాది డిసెంబర్ 20న ఓ న్యాయ విద్యార్థి తన వృద్ధ తల్లిదండ్రులు, తాతామామ్మలను తీసుకెళ్లేందుకు తమిళనాడులోని రాజపాళయం రైల్వే స్టేషన్‌కు కారులో వెళ్లాడు. కారు ఇంజిన్ ఆపకుండా, ప్రయాణికులను ఎక్కించుకునేందుకు కేటాయించిన డ్రాప్-ఆఫ్ ప్రాంతంలోనే ముందుకు కదులుతున్నాడు. వాహనాన్ని ఎక్కడా నిలపలేదు. పార్కింగ్ స్థలంలోకి కూడా తీసుకెళ్లలేదు. అయినప్పటికీ పార్కింగ్ కాంట్రాక్టర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డుకుని '6 నిమిషాల రూల్' పేరుతో రూ. 20 చెల్లించాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే రైల్వే చట్టంలోని సెక్షన్ 159 కింద రూ. 500 జరిమానా విధిస్తామని బెదిరించారు. వారిలో ఒకరు దక్షిణ రైల్వే లోగో ఉన్న గుర్తింపు కార్డు చూపించడంతో ఒత్తిడికి గురైన యువకుడు రూ. 20 చెల్లించి రసీదు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల ముందే సిబ్బంది తనను అవమానించారని ఆరోపిస్తూ యువకుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. విచారణ చేపట్టిన కమిషన్ బెంచ్.. పార్కింగ్ కాంట్రాక్టర్ పరిధి కేటాయించిన పార్కింగ్ స్థలానికే పరిమితమని స్పష్టం చేసింది. డ్రాప్-ఆఫ్ జోన్‌లో ప్రయాణికులను ఎక్కించేందుకు, దించేందుకు ఆరు నిమిషాల వరకు ఉచిత సమయం ఉంటుందని, ఆ సమయంలో రుసుము వసూలు చేసే హక్కు కాంట్రాక్టర్‌కు లేదని పేర్కొంది. కారును పార్క్ చేయకుండానే ఫీజు వసూలు చేయడం వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం అన్యాయమైన వ్యాపార పద్ధతని తేల్చింది.

జాకిర్ నాయక్ సంస్థపై
మరో ఐదేళ్లు నిషేధం

న్యూఢిల్లీ, నవంబర్ 13 : వివాదాస్పద ఇస్లామిక్ మత ప్రబోధకుడు జాకిర్ నాయక్ నేతృత్వంలోని ఇస్లామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఐఆర్ఎఫ్)పై కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లపాటు నిషేధాన్ని పొడిగించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)-1967 కింద ఐఆర్ఎఫ్‌ను చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటించింది. దేశ భద్రతకు ముప్పు కలిగించడం, మత సామరస్యాన్ని దెబ్బతీయడం వంటి ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం శాఖ తెలిపింది. ఐఆర్ఎఫ్ కార్యకలాపాలు దేశ లౌకిక వ్యవస్థకు విఘాతం కలిగించేలా ఉన్నాయని పేర్కొంది. సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు జాకిర్ నాయక్ తన ప్రసంగాల ద్వారా వివిధ మత వర్గాల మధ్య శత్రుత్వం, విద్వేషాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించింది. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు దేశ, విదేశాల్లోని కొందరు యువతను ఉగ్రవాద చర్యల వైపు ప్రేరేపిస్తున్నాయని కేంద్రం పేర్కొంది. అంతర్జాతీయ శాటిలైట్ టీవీ నెట్‌వర్క్, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి తన ప్రసంగాలను చేరవేస్తున్నారని తెలిపింది. 2021 నవంబర్ 15న తొలిసారిగా ఐఆర్ఎఫ్‌పై కేంద్రం నిషేధం విధించింది. తాజాగా ఈ నిషేధాన్ని 2026 నవంబర్ 14 వరకు పొడిగించినట్లు ప్రకటించింది. సంస్థ కార్యకలాపాలను అడ్డుకోకపోతే పరారీలో ఉన్న కార్యకర్తలను మళ్లీ సమీకరించడం, మత సామరస్యాన్ని దెబ్బతీయడం, దేశ వ్యతిరేక భావాలను ప్రచారం చేయడం, మిలిటెన్సీని ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని హోం శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

దేశ భద్రతలో
ప్రైవేటు భద్రతా సిబ్బంది భేష్

మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది

మాజీ సైనికుల అనుభవాన్ని ఉపయోగించుకోవాలని సూచన

న్యూఢిల్లీ, నవంబర్ 13 : దేశ రక్షణలో ప్రైవేటు భద్రతా సిబ్బంది కూడా కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ఆపరేషన్ సిందూర్ చాటిందని మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. వీరిలో ఎక్కువ మంది మాజీ సైనికులేనని, భవిష్యత్తులో జరిగే యుద్ధాల్లో సైన్యం, పోలీసులతో పాటు వీరి పాత్ర కూడా ముఖ్యమవుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలో సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ (క్యాప్సీ) నిర్వహించిన 21వ వార్షిక భద్రతా నాయకత్వ సదస్సులో ఆయన మాట్లాడారు. మాజీ సైనికుల అనుభవానికి గుర్తింపు ఇవ్వడంతో పాటు, వారి నైపుణ్యాలకు అధికారిక ధ్రువీకరణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గార్డింగ్ ఆఫీసర్ కార్యక్రమం ద్వారా భద్రతా సిబ్బందికి ప్రత్యేక హోదా కల్పించే ప్రయత్నాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి సెప్టెంబరులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) లభించినట్లు తెలిపారు. శిక్షణ, నైపుణ్య పరీక్షలు, ధ్రువీకరణ కోసం రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీతో క్యాప్సీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని అభినందించారు. అయితే కొత్త హోదా కేవలం పేరుకే పరిమితం కాకూడదని ద్వివేది సూచించారు. భద్రతా సిబ్బందికి వారి నైపుణ్యాలకు తగిన బాధ్యతలు అప్పగించాలని, గార్డు స్థాయి నుంచి సూపర్‌వైజర్, మేనేజర్ స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించాలని అన్నారు. ప్రైవేటు భద్రతా సంస్థల నియంత్రణ చట్టం (పీఎస్ఏఆర్ఏ) కింద లైసెన్సుల జారీ ప్రక్రియను కూడా మరింత సులభతరం చేయాలని సూచించారు.

జేఈఈ మెయిన్ దరఖాస్తుల్లో
ఆధార్, జాతీయతపై ఎన్‌టీఏ స్పష్టత

నవంబర్ 22 చివరి తేదీ.. ఇప్పటివరకు 5.72 లక్షల రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ, నవంబర్ 13 : జేఈఈ మెయిన్-2027 దరఖాస్తుల్లో ఆధార్ స్థితి, జాతీయత ఆధారంగా ఏ కేటగిరీని ఎంచుకోవాలో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) స్పష్టత ఇచ్చింది. దరఖాస్తు సమయంలో పొరపాట్లు జరగకుండా శుక్రవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. భారత పౌరులు, ఆధార్ కార్డు ఉన్న ఎన్నారైలు 'ఇండియన్ నేషనల్స్' కేటగిరీని ఎంచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. విదేశీ పౌరులు, ఓసీఐ కార్డుదారులు 'ఫారిన్ నేషనల్స్' విభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. భారత పాస్‌పోర్టు ఉండి, ఆధార్ కార్డు లేని ఎన్నారైలు 'ఎన్నారైస్ హేవింగ్ నో ఆధార్' కేటగిరీని ఎంచుకోవాలని తెలిపింది. జేఈఈ మెయిన్-2027 తొలి విడత పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు నవంబర్ 22 చివరి తేదీ అని గుర్తుచేసింది. ఇప్పటివరకు 5.72 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని, 4.07 లక్షల మందికి పైగా పరీక్ష ఫీజు చెల్లించారని వెల్లడించింది. అభ్యర్థులు దరఖాస్తు పూర్తి చేసి, ఫీజు చెల్లించిన తర్వాత కన్ఫర్మేషన్ పేజీని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. గుర్తింపు వివరాల్లో తప్పులు రాకుండా అభ్యర్థులు తమ డిజిలాకర్, జనపరిచయ్ లేదా ఈ-ప్రమాణ్ ఖాతాల ద్వారానే లాగిన్ కావాలని తెలిపింది. దరఖాస్తుకు ముందు డిజిలాకర్‌లో రీ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించింది. అభ్యర్థి పేరు, పుట్టిన తేదీ పదో తరగతి సర్టిఫికెట్ లేదా మార్కుల జాబితాలోని వివరాలతో సరిపోవాలి. దరఖాస్తులో తప్పులు చేసినవారికి మరో అవకాశం కల్పించింది. ఇప్పటికే అప్లికేషన్ నంబర్ పొంది, ఫీజు చెల్లించినా తొలి విడతకు కొత్త దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపింది. అయితే కొత్త దరఖాస్తుకు ఫీజు చెల్లించి కన్ఫర్మేషన్ పేజీ పొందిన దరఖాస్తునే పరిగణనలోకి తీసుకుంటారు. కొత్త దరఖాస్తు సమర్పించి ఫీజు చెల్లించకపోతే, గతంలో ఫీజు చెల్లించి కన్ఫర్మేషన్ పేజీ పొందిన దరఖాస్తే చెల్లుబాటవుతుంది. ప్రతి కొత్త దరఖాస్తుకు కొత్త అప్లికేషన్ నంబర్ కేటాయిస్తారు. ఫొటో, సంతకం సహా అన్ని వివరాలు, పత్రాలను మళ్లీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

భారత్ సమ్మిట్‌కు 115 మంది
విదేశీ వక్తలకు నో పర్మిషన్

కేంద్రంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మండిపాటు



న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబర్ 13 : హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన విదేశీ వక్తల్లో 115 మందికి భారత్‌లోకి ప్రవేశం నిరాకరించారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆరోపించారు. మరికొందరి వీసాలు రద్దు చేసినట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. విమర్శలను కూడా సహించలేని పరిస్థితి ప్రజాస్వామ్య దేశంలో నెలకొందని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన మూడు రోజుల భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన శశిథరూర్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. విదేశాంగ శాఖ అనుమతి ఇచ్చిన 315 మంది వక్తల్లో 115 మందికి ప్రవేశం నిరాకరించడం లేదా వీసాలు రద్దు చేయడం జరిగిందని చెప్పారు. ఏ చట్ట నిబంధన కింద ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందో స్పష్టత లేదని ప్రశ్నించారు. సమ్మిట్ మరుసటి రోజే ముగియనుండటంతో ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే అవకాశం కూడా లేదని అన్నారు. మారుతున్న ప్రపంచ వ్యవస్థ, అంతర్జాతీయ పరిణామాలు, వాటిపై భారత్ అనుసరించాల్సిన వ్యూహం, సహకార సమాఖ్యవాదం, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చించేందుకు 70 దేశాల నుంచి నిపుణులను కాంగ్రెస్ ఈ సదస్సుకు ఆహ్వానించింది. సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే స

లక్ష్మీ చిత్రం



భార్య 'పిచ్చి ప్రేమలో' నితిన్

ఈవార్తలు, వినోదవాణి: సినిమాల్లో ప్రేమ పాటలంటే ఎక్కువగా కాలేజీ రోజులు, పెళ్లికి ముందు ప్రేమ చుట్టూనే తిరుగుతుంటాయి. కానీ పెళ్లి తర్వాత భార్యాభర్తల మధ్య పెరిగే అనురాగాన్ని పాటగా మలిస్తే ఎలా ఉంటుందో చూపిస్తోంది నితిన్ తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి'. నాని సమర్పణలో నితిన్, ఆఫియా జంటగా నటిస్తున్న ఈ సినిమాకు మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'పిచ్చి ప్రేమలో' అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు. భార్యపై భర్తకు ఉండే ప్రేమను రచయిత కృష్ణ కుమార్ సహజమైన పదాలతో అందంగా రాశారు. 'పిచ్చి ప్రేమలో నన్నే ముంచుతావే ఓ వగలాడి.. చందమామలో మచ్చ కూడా లేదే ఓ ప్రియురాలా..' అంటూ సాగే పల్లవి వినసొంపుగా ఉంది. భార్య దూరమైతే కలిగే బాధ, పక్కన ఉంటే కలిగే సంతోషాన్ని తెలిపే లైన్లు నేటి తరం జంటలకు త్వరగా కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ ఈ పాటకు ఆహ్లాదకరమైన ట్యూన్ అందించారు. ఫ్లూట్, గిటార్, లైట్ డ్రమ్స్‌తో పాటను వినసొంపుగా రూపొందించారు. మధ్యలో వచ్చే ఇంటర్‌లూడ్స్ కూడా ఆకట్టుకుంటున్నాయి. సింగర్ కార్తీక్ తన గొంతుతో పాటకు మరింత అందం తీసుకొచ్చారు. లిరికల్ వీడియోలో నితిన్, ఆఫియా మధ్య కెమిస్ట్రీ సహజంగా కుదిరింది. కృష్ణ పాత్రలో నితిన్ భార్యను అమితంగా ప్రేమించే మధ్యతరగతి భర్తగా కనిపించారు. రుక్మిణి పాత్రలో ఆఫియా ఒదిగిపోయారు. వీరిద్దరి మధ్య వచ్చే సరదా సన్నివేశాలు, రోజువారీ జీవితంలోని చిన్న చిన్న మూమెంట్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ పాట సోషల్ మీడియా రీల్స్‌లోనూ సందడి చేసే అవకాశం ఉంది. నాని సమర్పణలో దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్లలో భాగంగా విడుదల చేస్తున్న పాటలు సినిమా కథ, నేపథ్యంపై ఆసక్తిని పెంచుతున్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది.



కీరవాణి అంకితభావం
అద్భుతం: అనుపమ్ ఖేర్



ఈవార్తలు, వినోదవాణి: ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి అంకితభావంపై బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ప్రశంసలు కురిపించారు. ఏకంగా 22 కిలోల బరువు తగ్గిన కీరవాణి మేకోవర్ తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న అనుపమ్ ఖేర్.. కీరవాణిని ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కీరవాణి బరువు తగ్గడానికి చేసిన ప్రయత్నాన్ని అభినందిస్తూ, ఆయన అంకితభావం తనను ఆశ్చర్యపరిచిందని అనుపమ్ ఖేర్ తెలిపారు. కీరవాణి ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన పాత ఫొటోతో పాటు ప్రస్తుత రూపాన్ని చూపించే బిఫోర్, ఆఫ్టర్ ఫొటోలను కూడా పోస్టు చేశారు. ఈ ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇక అనుపమ్ ఖేర్ ఇటీవల నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణం' సినిమాలో జటాయువు పాత్రలో కనిపిస్తున్నారు. ఈ పాత్రకు గాత్రం అందించడంతో పాటు నటుడిగానూ వ్యవహరిస్తున్నారు. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, యశ్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్నారు. మరోవైపు 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు సంగీతం అందించిన కీరవాణి ఆస్కార్ అవార్డును సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. కీరవాణి తాజా మేకోవర్‌పై పలువురు అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



నాకూ అప్పులు ఉండేవి: దీపిక పదుకొణె

ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె తన సినీ ప్రయాణం ప్రారంభంలో ఎదుర్కొన్న కష్టాలను తాజాగా గుర్తు చేసుకున్నారు. నటిగా ఎదగాలనే కోరికతో మోడలింగ్, ఫొటోషూట్ల కోసం తల్లి దగ్గర రూ.10 వేలు అప్పుగా తీసుకున్న విషయాన్ని వెల్లడించారు. ఆ డబ్బును తిరిగి ఇచ్చి, తనను గర్వపడేలా చేస్తానని తల్లికి మాట ఇచ్చినట్లు చెప్పారు. దీపిక తండ్రి ప్రకాష్ పదుకొణె ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా దేశానికి పేరు తీసుకొచ్చారు. తన తండ్రి బాటలోనే క్రీడారంగంలోకి వెళ్లి ఉంటే ఆయన సంతోషించేవారేమోనని దీపిక తెలిపారు. అయితే తనకు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉండేదని చెప్పారు. 16 ఏళ్ల వయసులోనే నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. కెమెరా ముందుకు రావాలనే కోరిక బలంగా ఉండేదని, అందుకోసం మోడలింగ్, ఫొటోషూట్లతో కెరీర్ ప్రారంభించాలని భావించినట్లు చెప్పారు. ఇందుకోసం తల్లి దగ్గర రూ.10 వేలు తీసుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ తర్వాత తన కెరీర్‌లో మంచి స్థాయికి చేరుకున్నారు.



'సెల్ఫ్ రెస్పెక్ట్' పద్ధతిలో అనిరుధ్, కావ్య పెళ్లి

ఈవార్తలు, వినోదవాణి: సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కుమార్తె, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. నవంబర్ 10, 11 తేదీల్లో గ్రీస్‌లో జరిగిన వీరి పెళ్లి వేదుకల్లో 'సెల్ఫ్ రెస్పెక్ట్' పద్ధతిని అనుసరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పద్ధతినే స్వాభిమానం వివాహం అని కూడా అంటారు. ఈ పెళ్లికి సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అయితే వేదుకలో పురోహితులు, మత పెద్దలు కనిపించకపోవడం, వధూవరులు పూలదండలు మార్చుకోవడంతో ఈ వివాహం సెల్ఫ్ రెస్పెక్ట్ పద్ధతిలో జరిగిందనే చర్చ మొదలైంది. ఈ విషయంపై డీఎంకే ఐటీ విభాగం కార్యదర్శి డాక్టర్ టీఆర్‌బీ రాజా స్పందించినట్లు సమాచారం. అనిరుధ్, కావ్య ఈ పద్ధతిలోనే పెళ్లి చేసుకున్నారని ఆయన స్పష్టం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి.

సల్మాన్ అల్లరి పిల్లాడు

ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఫ్యామిలీ డ్రామా 'హమ్ సాత్-సాత్ హైన్' షూటింగ్ రోజుల్ని నటి సోనాలి బింద్రే తాజాగా గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా సెట్స్‌లో సల్మాన్ ఖాన్ చేసిన అల్లరి పనులు మొదట్లో తనకు కోపం తెప్పించేవని, అయితే కాలక్రమంలో ఆయన మనసు ఎంత మంచిదో అర్థమైందని చెప్పారు. సల్మాన్ ఖాన్, సైఫ్ అలీ ఖాన్, మోహ్నిష్ బహల్, టబు, సోనాలి బింద్రే, కరిష్మా కపూర్ ప్రధాన పాత్రల్లో సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. 1999లో విడుదలైన ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా రూ.81 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. షూటింగ్ సమయంలో సల్మాన్ చేసే చిలిపి పనుల గురించి సోనాలి మాట్లాడుతూ.. కెమెరా ముందు ప్రశాంతంగా కనిపించినా, సెట్స్ వెనుక మాత్రం ఆయన ఎంతో అల్లరి చేస్తారని చెప్పారు. తోటి నటీనటులను ఆటపట్టించడం, ప్రాంక్స్ చేయడం ఆయనకు అలవాటని తెలిపారు. అందరూ సీరియస్‌గా సీన్లకు సిద్ధమవుతున్న సమయంలోనూ జోకులు వేస్తూ ఏకాగ్రతను దెబ్బతీసేవారని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో సల్మాన్ అల్లరి చూసి తనకు కోపం వచ్చేదని, ఆయనతో షూటింగ్ ఎలా పూర్తి చేయాలా అని అనిపించేదని చెప్పారు.

ఈవార్తలు, వినోదవాణి: సినిమాల్లో మహిళా నటీమణులు పూర్తి గుండుతో కనిపించడం అరుదుగా జరుగుతుంటుంది. గతంలో షబానా ఆజ్మీ, అంతర మాలీ, తన్వీ ఆజ్మీ వంటి నటీమణులు ఈ సాహసం చేశారు. ఇప్పుడు ఈ జాబితాలో హ్యూమా ఖురేషి కూడా చేరారు. 'మహారాణి' వెబ్ సిరీస్ ఐదో సీజన్‌లో ఆమె పూర్తి గుండు లుక్‌లో కనిపించనున్నారు. ఈ సిరీస్‌లో రాణి భారతి అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న హ్యూమా.. తన కెరీర్‌లో తొలిసారి ఇలా గుండుతో కనిపించబోతున్నారు. తొలుత ఈ లుక్ విషయంలో కొంత సందేహించినా, చివరకు కొత్త సవాల్‌ను స్వీకరించాలని నిర్ణయించుకున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ లుక్ రాణి భారతి పాత్రను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడిందని చెప్పారు. తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిన చిత్రబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల విడుదలైన ప్రోమోలో హ్యూమా కొత్త లుక్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. 2027 ఫిబ్రవరిలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కథ విషయానికి వస్తే.. గత సీజన్‌లో తన కుమారుడు జై హత్యకు గురికావడంతో రాణి భారతి తీవ్ర విషాదంలో మునిగిపోతుంది. ఐదో సీజన్‌లో కుమారుడి మరణానికి ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేయనుంది. ఇప్పటివరకు రాజకీయాలు, అధికారం చుట్టూ తిరిగిన కథ ఈసారి వ్యక్తిగత నష్టం, ప్రతీకార పోరాటం నేపథ్యంలో సాగనుంది. సుభాష్ కపూర్ సృష్టించిన ఈ సిరీస్ ఐదో సీజన్‌కు పునీత్ ప్రకాష్ దర్శకత్వం వహిస్తున్నారు. కాంగ్రా టాకీస్ బ్యానర్‌పై నరేన్ కుమార్, డింపుల్ ఖర్బందా నిర్మిస్తున్నారు. ఈ సిరీస్‌లో రాణి భారతి పాత్రతో హ్యూమా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా గుండు లుక్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల ఆమె యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలోనూ నటించారు. గతంలో రజనీకాంత్ 'కాలా', అజిత్ 'వాలిమై' చిత్రాల్లోనూ కనిపించారు.



సాయిపల్లవి కాళ్లు మొక్కిన డైలాగ్ కోచ్

ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమాలో సీత పాత్ర పోషిస్తున్న సాయిపల్లవికి షూటింగ్ సమయంలో ఓ అరుదైన అనుభవం ఎదురైంది. ఆమె నటనకు ముగ్ధురాలైన డైలాగ్ కోచ్ నేరుగా వచ్చి పాదాలకు నమస్కరించడంతో సాయిపల్లవి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. సినిమా షూటింగ్ సమయంలో సాయిపల్లవి నటనను చూసిన మహిళా డైలాగ్ కోచ్.. ఆమెను సీత పాత్రలోనే చూసుకున్నారని తెలుస్తోంది. ఆ పాత్రపై ఆమెకు ఉన్న గౌరవం, భక్తి కారణంగానే సాయిపల్లవి పాదాలకు నమస్కరించినట్లు సమాచారం. ఈ అనుభవాన్ని సాయిపల్లవి తాజాగా వెల్లడించారు. దేవుళ్లు, దేవతల పాత్రల్లో నటించే వారిని అభిమానులు నిజంగానే ఆ రూపాల్లో చూడటం గతంలోనూ జరిగింది.

గుండుతో హ్యూమా ఖురేషి



సాకులు చెప్పొద్దు: గంభీర్

ఈవార్తలు, క్రీడావాణి: అంతర్జాతీయ క్రికెట్‌లో ఎదుర్కోలేని బంతులంటూ ఏవీ ఉండవని, ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొనే బాధ్యత బ్యాటర్లదేనని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో భారత్ 244 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడాడు. బ్యాటర్లు తమ వైఫల్యాలకు కారణాలు చెప్పడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేశాడని గంభీర్ అంగీకరించాడు. అయితే ఆ బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం భారత బ్యాటర్లకు ఉండాలని అన్నాడు. "అంతర్జాతీయ స్థాయిలో ఆడలేని బంతులంటూ ఉండవు. హెన్రీ సరైన ప్రాంతాల్లో బంతులు వేశాడు. కానీ బ్యాటర్లు వాటిని ఎదుర్కోవాల్సింది. పిచ్‌పై పెద్దగా స్వింగ్ లేదా విపరీతమైన సీమ్ కదలికలు లేవు. పిచ్‌ను సాకుగా చూపలేం. బంతి కదలికలను అధిగమించడం బ్యాటర్ బాధ్యత. బౌలర్లు వేసిన లెంగ్త్‌ల వల్లే ఇబ్బందులు ఎదురయ్యాయి. మన ఆటగాళ్లు క్రీజుకే పరిమితమయ్యారు" అని గంభీర్ వ్యాఖ్యానించాడు. "90 పరుగుల లోపే ఆలౌట్ అయినప్పుడు ఆందోళన సహజం. ప్రపంచకప్ జరిగే వేదికల పరిస్థితులు ఇక్కడి పరిస్థితులకు దాదాపు సమానంగా ఉంటాయి. గత మ్యాచ్‌లోనూ ఏడు వికెట్లు కోల్పోయాం. కాబట్టి మానసికంగా, సాంకేతికంగా మరింత సన్నద్ధం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో వికెట్లు కోల్పోకుండా 35 నుంచి 40 పరుగులు చేసినా సరిపోతుంది. జట్టులో అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నారు. చివరి మ్యాచ్ నాటికి పుంజుకుంటామని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. ఫీల్డింగ్‌లో చేసిన తప్పిదాలు కూడా ఓటమికి కారణమయ్యాయని గంభీర్ పేర్కొన్నాడు. సెంచరీ చేసిన విల్ యంగ్ ఇచ్చిన క్యాచ్‌లను జారవిడవడం మ్యాచ్‌పై ప్రభావం చూపిందన్నాడు. ఆకిబ్ నబీ బౌలింగ్‌లో యంగ్ క్యాచ్ పట్టుకుని ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. క్యాచ్‌లు వదిలేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. అయితే భారత బౌలింగ్ విభాగాన్ని గంభీర్ సమర్థించాడు. దేశం తరఫున ఆడే ప్రతి ఆటగాడిపై తనకు నమ్మకం ఉందని, న్యూజిలాండ్‌ను కట్టడి చేసేందుకు బౌలర్లు ప్రయత్నించారని చెప్పాడు. అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, ఆకిబ్ నబీ తలో రెండు వికెట్లు తీయడాన్ని ప్రశంసించాడు. ఈ పరాజయంతో సిరీస్‌లో భారత్ ఆధిక్యం 2-1కి తగ్గింది. ఐదో, ఆఖరి వన్డే ఆదివారం బే ఓవల్‌లో జరగనుంది.

హెన్రీకి కోహ్లీ టీమిండియా జెర్సీ

ఈవార్తలు, క్రీడావాణి: మైదానంలో ప్రత్యర్థులుగా తలపడినా.. మ్యాచ్ ముగిశాక ఆటగాళ్ల ప్రతిభను గౌరవించడంలో విరాట్ కోహ్లీ ముందుంటాడు. న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో భారత బ్యాటింగ్ పతనానికి కారణమైన పేసర్ మాట్ హెన్రీకి తన టీమిండియా జెర్సీని బహుమతిగా ఇచ్చి మరోసారి క్రీడాస్ఫూర్తిని చాటాడు. శుక్రవారం మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో హెన్రీ 27 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఇది అతడి వన్డే కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన. ముఖ్యంగా ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్ చేశాడు. వన్డేల్లో భారత జట్టు తొలి మూడు వికెట్లను ఒక్క పరుగు కూడా చేయకుండానే కోల్పోవడం ఇదే తొలిసారి. హెన్రీ బౌలింగ్‌లో నాలుగు బంతులు ఎదుర్కొన్న కోహ్లీ డకౌట్ అయ్యాడు. మ్యాచ్ అనంతరం హెన్రీని అభినందించిన కోహ్లీ.. అతడికి తన జెర్సీని అందించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న హెన్రీతో కాసేపు మాట్లాడాడు. ఇద్దరూ చిరునవ్వులతో మ్యాచ్ గురించి చర్చించుకున్నారు. హెన్రీ ఐదో బంతికి కోహ్లీని క్లీన్‌బౌల్డ్ చేశాడు. తొలుత బయటకు వెళ్లేలా బంతులు వేసిన అతడు.. ఆ తర్వాత లోపలికి దూసుకొచ్చిన బంతితో కోహ్లీని బోల్తా కొట్టించాడు. అనంతరం శ్రేయస్ అయ్యర్‌ను రివ్యూలో ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (27), అక్షర్ పటేల్ (21), నమన్ ధీర్ (21) కొంతసేపు పోరాడినా భారత్‌ను లక్ష్యం దిశగా తీసుకెళ్లలేకపోయారు. రెండో స్పెల్‌లో మరో మూడు వికెట్లు తీసిన హెన్రీ న్యూజిలాండ్ భారీ విజయానికి బాటలు వేశాడు. మ్యాచ్ అనంతరం హెన్రీ మాట్లాడుతూ.. గాలి బలంగా వీస్తుండటంతో పెద్దగా ప్రయోగాలు చేయకుండా సాధారణంగానే బౌలింగ్ చేశానని చెప్పాడు.





భారత్‌కు ఘోర పరాజయం

నాలుగో వన్డేలో 244 పరుగుల తేడాతో ఓటమి.. కివీస్ ఘన విజయం



కివీస్ గడ్డపై టీమిండియాకు ఘోర పరాభవం ఎదురైంది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు 244 పరుగుల భారీ తేడాతో చిత్తయింది. 334 పరుగుల లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు కివీస్ పేసర్ల ధాటికి నిలవలేక 89 పరుగులకే కుప్పకూలారు. మాట్ హెన్రీ నిప్పులు చెరిగే బంతులతో ఆరు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు. వన్డే చరిత్రలో భారత్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమి కావడం గమనార్హం.

ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు.. ఆ తర్వాత వరుసగా పెవిలియన్‌కు క్యూ.. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి భారత బ్యాటింగ్ పేకమేడలా కూలిపోయింది. నాలుగో వన్డేలో 244 పరుగుల తేడాతో ఓటమి పాలైన టీమిండియా చరిత్రలోనే అత్యంత దారుణమైన పరాజయాల్లో ఒకటిని మూటగట్టుకుంది. విల్ యంగ్ సెంచరీతో కివీస్ భారీ స్కోరు సాధించగా.. మాట్ హెన్రీ ఆరు వికెట్లతో భారత్‌ను దెబ్బతీశాడు.



న్యూజిలాండ్ నిర్దేశించిన 334 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. కివీస్ పేసర్ మాట్ హెన్రీ తొలి ఓవర్‌లోనే భారత టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ ముగ్గురినీ డకౌట్‌గా పెవిలియన్‌కు పంపాడు. దీంతో ఒక్క పరుగు కూడా చేయకుండానే భారత్ మూడు వికెట్లు కోల్పోయింది. వన్డే క్రికెట్ చరిత్రలో భారత్ ఒకే ఓవర్‌లో తొలి మూడు వికెట్లను పరుగులేమీ చేయకుండానే కోల్పోవడం ఇదే తొలిసారి.

టాప్ ఆర్డర్ కుప్పకూలి..

తొలి ఓవర్‌లో ఎదురైన దెబ్బ నుంచి భారత జట్టు ఏమాత్రం కోలుకోలేకపోయింది. రుతురాజ్ గైక్వాడ్ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ కొంత పోరాటం కనబరిచాడు. 53 బంతుల్లో 27 పరుగులు చేశాడు. అక్షర్ పటేల్ 36 బంతుల్లో 21 పరుగులు, నామన్ ధీర్ 24 బంతుల్లో 21 పరుగులు చేసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో భారత ఇన్నింగ్స్ 26.4 ఓవర్లలో 89 పరుగుల వద్ద ముగిసింది.

హెన్రీ దెబ్బకు విలవిల..

న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో పాటు స్వింగ్, బౌన్స్‌తో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. తొలి ఓవర్‌లోనే మూడు కీలక వికెట్లు తీసిన అతడు.. ఆ తర్వాత కూడా అదే జోరును కొనసాగించాడు. మొత్తం 9.4 ఓవర్లు వేసి 27 పరుగులు మాత్రమే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. మ్యాథ్యూ ఫిషర్ మూడు వికెట్లతో హెన్రీకి చక్కటి సహకారం అందించాడు.

యంగ్ శతకంతో కివీస్ భారీ స్కోరు..

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టు బ్యాటర్ విల్ యంగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 108 బంతుల్లో 125 పరుగులు సాధించి జట్టు భారీ స్కోరుకు పునాది వేశాడు. టిమ్ సీఫెర్ట్ 58 పరుగులతో రాణించగా, ఫిన్ అలెన్ 41 పరుగులు చేశాడు. భారత ఫీల్డర్లు యంగ్‌కు ఆరంభంలోనే రెండు క్యాచ్‌లు వదిలేయడం కివీస్‌కు కలిసొచ్చింది. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకున్న యంగ్ సెంచరీతో చెలరేగాడు.

సిరీస్‌పై భారత్ ఆధిక్యం..

ఈ ఘన విజయంతో న్యూజిలాండ్ ఐదు వన్డేల సిరీస్‌లో 1-2తో నిలిచింది. తొలి రెండు వన్డేల్లో భారత్ విజయం సాధించగా, మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. నాలుగో వన్డేలో కివీస్ భారీ విజయం సాధించడంతో చివరి మ్యాచ్‌పై ఆసక్తి పెరిగింది. ఆదివారం (నవంబర్ 15) ఇదే మౌంట్ మాంగనూయి వేదికగా ఐదో వన్డే జరగనుంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. న్యూజిలాండ్ గెలిస్తే సిరీస్ 2-2తో సమమవుతుంది.

రెండో అతిపెద్ద ఓటమి..

ఈ పరాజయంతో భారత్ వన్డే క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా రెండో అతిపెద్ద ఓటమిని నమోదు చేసింది. 2000లో షార్జాలో శ్రీలంక చేతిలో 245 పరుగుల తేడాతో ఓడిన భారత్.. ఇప్పుడు న్యూజిలాండ్ చేతిలో 244 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. కేవలం ఒక్క పరుగు తేడాతో చెత్త రికార్డును తప్పించుకుంది. అంతేకాకుండా 89 పరుగులకే ఆలౌట్ కావడం భారత్ వన్డే చరిత్రలో ఆరో అత్యల్ప స్కోరు.

వన్డేల్లో భారత్‌కు భారీ ఓటములు

పరుగుల తేడా ఆధారంగా.. ముఖ్యమైన రికార్డులు

పరుగుల తేడా	ప్రత్యర్థి	వేదిక	సంవత్సరం
245	శ్రీలంక	షార్జా	2000
244	న్యూజిలాండ్	మౌంట్ మాంగనూయి	2026
214	దక్షిణాఫ్రికా	ముంబై	2015
208	ఆస్ట్రేలియా	సిడ్నీ	2004
202	ఇంగ్లండ్	లార్డ్స్	1975
200	న్యూజిలాండ్	దంబుల్లా	2010

ఐపీఎల్‌లో 12 జట్లు అవసరం లేదు

ఈవార్తలు, క్రీడావాణి: ఐపీఎల్‌లో జట్ల సంఖ్యను ఇప్పట్లో 12కు పెంచే ఆలోచన లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని లీగ్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ స్వాగతించారు. అయితే భవిష్యత్తులో 94 మ్యాచ్‌ల ఫార్మాట్ తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా టోర్నీ షెడ్యూల్‌ను మార్చాలని సూచించారు. 2028 నాటికి ఐపీఎల్ జట్ల సంఖ్యను 10 నుంచి 12కు పెంచుతారనే ప్రచారంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవల స్పందించారు. ఈ అంశంపై బోర్డులో అధికారికంగా కానీ, అనధికారికంగా కానీ ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. దీనిపై లలిత్ మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 12 జట్ల విస్తరణపై వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ ప్రకటనతో తెరపడటం మంచి పరిణామమని పేర్కొన్నారు. భవిష్యత్తులో 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుందని, అందుకు తగ్గట్టుగా షెడ్యూల్ ఎలా ఉండాలో తాను ఇప్పటికే సూచించానని తెలిపారు. వాతావరణ మార్పులను విస్మరించలేమని, పరిస్థితులకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. తాను గతంలో ప్రతిపాదించిన ఫార్మాట్‌ను బోర్డు అమలు చేయకపోయినా, టోర్నీని ముందుగా ప్రారంభించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. మే చివరి మూడు వారాల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని, ఆటగాళ్లను ఆ వేడి నుంచి కాపాడేందుకు టోర్నీని మూడు వారాలు ముందుకు జరిపి ఫిబ్రవరి మూడో వారంలో ప్రారంభించాలని సూచించారు.

ఖవాజా వ్యాఖ్యలపైనే మాట్లాడుకున్నాం: కమిన్స్



ఈవార్తలు, క్రీడావాణి ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్, అతడి భార్య బెక్కీ మధ్య వాగ్వాదం జరిగిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోపై కమిన్స్ స్పందించాడు. తమ మధ్య గొడవేమీ జరగలేదని స్పష్టం చేశాడు. మాజీ సహచరుడు ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలపై బెక్కీ తీవ్ర అసంతృప్తితో ఉందని, ఆ విషయం గురించే ఇద్దరూ మాట్లాడుకున్నామని వివరించాడు. శుక్రవారం సిడ్నీలో మీడియాతో మాట్లాడిన కమిన్స్.. భార్యతో గొడవ పడుతున్నట్లు ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేశాడు. వ్యక్తిగత జీవితాన్ని ఇలా బహిరంగ చర్చకు తీసుకురావడం విద్దూరంగా ఉందన్నాడు. వైరల్ వీడియోలో కనిపించింది గొడవ కాదని, ఖవాజా వ్యాఖ్యలపై బెక్కీ ఆగ్రహంగా ఉందని తెలిపాడు. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన బాల్ టాంపరింగ్ వివాదం మళ్లీ తెరపైకి రావడం ఆమెకు నచ్చలేదని చెప్పాడు. 2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా జరిగిన బాల్ టాంపరింగ్ ఉదంతంపై ఖవాజా తన ఆత్మకథ 'సర్వ్'లో పలు విషయాలు వెల్లడించాడు. మైదానంలో శాండ్‌పేపర్ ఉపయోగిస్తున్న విషయం కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లయన్ సహా జట్టు బౌలర్లందరికీ తెలుసని పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను కమిన్స్ ఖండించాడు. శాండ్‌పేపర్‌ను మైదానంలోకి తీసుకెళుతున్న విషయం తనకు తెలియదని, గత ఎనిమిదేళ్లుగా ఇదే చెబుతున్నానని స్పష్టం చేశాడు. తాను, మరికొందరు కలిసి శాండ్‌పేపర్‌తో బంతిని టాంపరింగ్ చేసే ప్రణాళిక రూపొందించామన్నట్లుగా ఖవాజా పుస్తకంలో పేర్కొనడం పూర్తిగా అవాస్తవమన్నాడు. ఖవాజా తన స్నేహితుడేనని చెబుతూనే.. ఇతరుల జీవితాలు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయాలను ఇంత తేలిగ్గా ప్రస్తావించడం సరికాదని విమర్శించాడు. తన కథను చెప్పుకునే హక్కు ఖవాజాకు ఉందని, అయితే అందులో పేర్కొనే విషయాలకు బాధ్యత వహించాలని సూచించాడు. 2018 వివాదం ఆస్ట్రేలియా క్రికెట్‌తో పాటు అందులో భాగమైన పలువురి జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని, ఆ సమయంలో ఆటగాళ్లతో పాటు వారి కుటుంబాలు కూడా బాధాకర పరిస్థితులు ఎదుర్కొన్నాయని కమిన్స్ గుర్తుచేశాడు.

ఈవార్తలు సంపాదకీయం Editorial

ప్రజల హక్కులకు భరోసా ఉందా?

పారిశ్రామిక పెట్టుబడులకు రాజకీయ మార్పుల ప్రభావం ఉండకూడదన్న ఆలోచన ఆర్థికాభివృద్ధికి అవసరమైనదే. ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను మరో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్చేస్తే పెట్టుబడిదారుల్లో అనిశ్చితి ఏర్పడుతుంది. ప్రాజెక్టుల అమలు ఆలస్యమవుతుంది. ప్రభుత్వాలపై నమ్మకం తగ్గుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ప్రతిపాదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పెట్టుబడిదారులకు భరోసా కల్పించే చట్టం పేరుతో ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, కార్మికుల హక్కులు బలహీనపడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా అంతే ముఖ్యం. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో నవంబర్ 13న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రతిపాదనను ప్రకటించారు. పెట్టుబడిదారులు ప్రభుత్వం మారిన తర్వాత తమకు గతంలో ఇచ్చిన హామీలు కొనసాగుతాయా? భూముల కేటాయింపులు రద్దవుతాయా? ఒప్పందాలను తిరగదోడతారా? రాజకీయ కక్ష సాధింపులకు గురవుతామా? అన్న అనుమానాలతో పెట్టుబడులు పెట్టడానికి వెనుకాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడుల రక్షణ చట్టం తీసుకురావాలని, ముందుగా రాష్ట్ర శాసనసభలో బిల్లు ఆమోదింపజేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. అదే రోజు పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు నిర్దిష్ట గడువులో చెల్లించేలా ఎస్క్రో ఖాతా విధానాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ రెండు చర్యల్లోనూ సానుకూలత ఉంది. పరిశ్రమలకు ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు సకాలంలో అందకపోతే పెట్టుబడుల వ్యయాలు పెరుగుతాయి. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అర్హత ఉన్నప్పటికీ చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎస్క్రో విధానం ద్వారా అర్హత కలిగిన ప్రోత్సాహకాలు నిర్దిష్ట గడువులో చెల్లిస్తే ఈ సమస్య కొంతవరకు తగ్గుతుంది. ప్రభుత్వ హామీలను వ్యక్తుల నిర్ణయాలపై కాకుండా స్పష్టమైన నిబంధనలు, వ్యవస్థల ఆధారంగా అమలు చేయడం మంచి పాలనకు సూచిక. అయితే పెట్టుబడుల రక్షణ చట్టం ఎలా ఉండబోతోందన్నదే అసలు ప్రశ్న. ఇప్పటివరకు వెల్లడైన సమాచారం ప్రకారం ఇది ప్రతిపాదన మాత్రమే. చట్ట ముసాయిదా, పూర్తి నిబంధనలు, అమలు విధానం ప్రజల ముందుకు రాలేదు. కాబట్టి దాని వల్ల కలిగే ప్రయోజనాలు, పరిమితులపై ఇప్పుడే తుది నిర్ణయానికి రావడం సరికాదు. కానీ చట్ట రూపకల్పనలో పాటించాల్సిన కొన్ని మౌలిక సూత్రాలపై ముందుగానే చర్చ జరగాలి. ప్రభుత్వం మారినంత మాత్రాన చట్టబద్ధమైన ఒప్పందాలు రద్దు కావడం, పెట్టుబడిదారులపై అనవసర ఒత్తిళ్లు తీసుకురావడం సరికాదు. అదే సమయంలో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో తప్పులు, అక్రమాలు ఉన్నాయని తేలితే వాటిని ప్రశ్నించకుండా వదిలేయడమూ ప్రజాస్వామ్య పాలన కాదు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఒప్పందాలను సవరించాల్సిన పరిస్థితులు రావచ్చు. పర్యావరణ అనుమతుల ఉల్లంఘన, భూసేకరణలో అక్రమాలు, కార్మిక చట్టాల ఉల్లంఘనలు, ప్రజలకు కలిగే నష్టాలను ఏ చట్టమూ కప్పిపుచ్చకూడదు. పెట్టుబడిదారులకు చట్టబద్ధమైన రక్షణ ఉండాలి. కానీ చట్టాన్ని ఉల్లంఘించే హక్కు ఎవరికీ ఉండకూడదు. భూమి కేటాయింపుల విషయంలోనూ పారదర్శకత అవసరం. పరిశ్రమల పేరుతో రైతుల నుంచి భూములు తీసుకుంటే వారికి న్యాయమైన పరిహారం అందాలి. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. పర్యావరణ అనుమతులు, నీటి వినియోగం, కాలుష్య నియంత్రణ విషయంలో రాజీ పడకూడదు. పరిశ్రమలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్తు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలి. పెట్టుబడులు వచ్చాయని చెప్పుకోవడం కంటే వాటి వల్ల స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు ఎంత మెరుగుపడ్డాయన్నదే అభివృద్ధికి అసలైన కొలమానం.

పెట్టుబడులు సరే.. ఉద్యోగాలేవి?

దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు (పీఎల్ఐ) కొంతమేర సానుకూల ఫలితాలనిస్తున్నాయి. పరిశ్రమల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఉత్పత్తి సామర్థ్యం విస్తరిస్తోంది. కొన్ని రంగాల్లో దిగుమతులపై ఆధారపడటం తగ్గుతోంది. కానీ ఈ అభివృద్ధి ప్రయాణంలో అత్యంత కీలకమైన ఉపాధి కల్పన మాత్రం ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు. నవంబర్ 12న నీతి ఆయోగ్ విడుదల చేసిన పీఎల్ఐ పథకాల ప్రభావంపై సమగ్ర నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. పరిశ్రమల అభివృద్ధిని కేవలం పెట్టుబడులు, ఉత్పత్తి విలువతో కొలవలేమని, వాటి వల్ల ఎంతమందికి ఉపాధి లభించిందన్నదే అసలు కొలమానమని ఈ నివేదిక మరోసారి గుర్తుచేస్తోంది. దేశవ్యాప్తంగా 14 కీలక రంగాల్లో అమలవుతున్న పీఎల్ఐ పథకాల కింద 2026 మార్చి నాటికి రూ. 2.40 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా రూ. 22.66 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి, అమ్మకాలు నమోదయ్యాయి. సుమారు 8.49 లక్షల మందికి ఉపాధి లభించినట్లు నివేదిక వెల్లడించింది. ఈ పథకాల కోసం మొత్తం రూ. 1.91 లక్షల కోట్ల నిధులను కేటాయించగా, ఇప్పటివరకు రూ. 35,354 కోట్ల ప్రోత్సాహకాలను మాత్రమే పంపిణీ చేశారు. పెట్టుబడుల పరంగా పూర్తి కాల లక్ష్యంలో 76 శాతం, ఉత్పత్తి పరంగా 64 శాతం సాధించారు. అయితే ఉపాధి కల్పన మాత్రం మొత్తం లక్ష్యంలో 28 శాతానికే పరిమితమైంది. పథకాల పూర్తి కాలంలో 30.18 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు నమోదైన సంఖ్య 8.49 లక్షలే. ఈ గణాంకాలను చూసి పీఎల్ఐ పథకాలు విఫలమయ్యాయని తేల్చేయడం తొందరపాటే. ఎందుకంటే మొత్తం అమలు కాలంలో 58 శాతం మాత్రమే పూర్తయింది. మరో 42 శాతం కాలం మిగిలి ఉంది. కొన్ని పరిశ్రమల్లో భారీ పెట్టుబడులు పెట్టిన వెంటనే ఉత్పత్తి ప్రారంభం కావడం లేదు. యంత్రాల ఏర్పాటు, సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడం, అనుమతులు, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం వంటి ప్రక్రియలకు సమయం పడుతుంది. ముఖ్యంగా బ్యాటరీలు, అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టిన తర్వాత ఫలితాలు కనిపించడానికి కొంత వ్యవధి అవసరం. అందువల్ల ఉపాధి లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంకా అవకాశం ఉందన్న నీతి ఆయోగ్ వివరణను పరిగణనలోకి తీసుకోవాలి. అయితే ఈ వివరణతో ఉపాధి విషయంలో కనిపిస్తున్న వెనుకబాటును తక్కువగా చూడకూడదు.

పారిశ్రామికాభివృద్ధి అంటే పెద్ద కంపెనీలు, భారీ యంత్రాలు, ఉత్పత్తి కేంద్రాలు మాత్రమే కాదు. ఆ పరిశ్రమల చుట్టూ చిన్న, మధ్యతరహా సంస్థలు పెరగాలి. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ లభించాలి. మహిళలకు ఉపాధి అవకాశాలు రావాలి. ముడిసరుకు సరఫరా నుంచి విడిభాగాల తయారీ, రవాణా, ప్యాకేజింగ్, నిర్వహణ వరకు అనేక అనుబంధ రంగాల్లో ఉద్యోగాలు సృష్టించాలి. అప్పుడే పరిశ్రమల వల్ల కలిగే ప్రయోజనం సమాజంలోని విస్తృత వర్గాలకు చేరుతుంది. పీఎల్ఐ పథకాలలో మరో కీలకమైన అంశం చిన్న పరిశ్రమల భాగస్వామ్యం. పెద్ద కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాలు వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చు. కానీ వాటికి అవసరమైన విడిభాగాలు, సేవలు అందించే ఎంఎస్ఎంఈలకు తగిన అవకాశాలు లభించకపోతే దేశీయ పారిశ్రామిక వ్యవస్థ బలపడదు. నీతి ఆయోగ్ నివేదిక కూడా చిన్న పరిశ్రమలకు లభిస్తున్న ప్రత్యక్ష ప్రయోజనాలు అసమానంగా ఉన్నాయని, సరఫరా వ్యవస్థలో వాటి భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని సూచిస్తోంది. పెద్ద కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇచ్చినంత మాత్రాన స్థానిక పరిశ్రమలు స్వయంగా ఎదగవు. వాటికి రుణాలు, సాంకేతిక సహకారం, నాణ్యత ప్రమాణాలపై శిక్షణ, మార్కెట్ అవకాశాలు కల్పించాలి. ప్రస్తుతం పీఎల్ఐ పథకాలు ప్రధానంగా ఉత్పత్తిని పెంచే దిశగా ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. కానీ ఉత్పత్తి పెరిగినంత మాత్రాన మార్కెట్ విస్తరిస్తుందని చెప్పలేం. దేశీయంగా తయారైన వస్తువులకు కొనుగోలు అవకాశాలు పెరగాలి. ప్రభుత్వ కొనుగోళ్లలో దేశీయ ఉత్పత్తులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. ఎగుమతుల కోసం అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడేలా పరిశ్రమలకు మద్దతు అందించాలి. ఈ దిశగా సరఫరా ఆధారిత ప్రోత్సాహకాలతో పాటు డిమాండ్‌ను పెంచే చర్యలు కూడా అవసరమని నీతి ఆయోగ్ నివేదిక సూచించడం గమనార్హం.

మరోవైపు ఉద్యోగాల లెక్కింపులోనూ పారదర్శకత అవసరం. ఎన్ని శాశ్వత ఉద్యోగాలు వచ్చాయి? ఎన్ని తాత్కాలిక ఉద్యోగాలు? మహిళల వాటా ఎంత? ఏ రాష్ట్రంలో ఎన్ని అవకాశాలు కల్పించారు? చిన్న పరిశ్రమల ద్వారా ఎంత ఉపాధి వచ్చింది? వంటి వివరాలను ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రజలకు వెల్లడించాలి. వివిధ మంత్రిత్వ శాఖలు ఒకే విధమైన ప్రమాణాలతో గణాంకాలను సేకరించాలని నివేదిక సూచించింది. ఈ సిఫారసును అమలు చేస్తేనే పథకాల వాస్తవ ప్రభావాన్ని అంచనా వేయడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం వెచ్చిస్తున్నది ప్రజాధనం. అందుకే ప్రతి రూపాయి ఖర్చుకు తగిన ఫలితం రావాలి. పెట్టుబడులు రావడం విజయమే. ఉత్పత్తి పెరగడం మరో విజయమే. కానీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాకపోతే ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది. పీఎల్ఐ పథకాల తదుపరి దశలో పరిశ్రమల విస్తరణతో పాటు ఉపాధి కల్పన, స్థానిక విడిభాగాల తయారీ, చిన్న పరిశ్రమల బలోపేతం, నైపుణ్యాభివృద్ధికి స్పష్టమైన ప్రాధాన్యం ఇవ్వాలి. దేశం తయారీ రంగంలో ప్రపంచంతో పోటీపడాలంటే కేవలం యంత్రాల సంఖ్య పెరగడం సరిపోదు. వాటిని నడిపే నైపుణ్యమున్న చేతులకు పని కల్పించాలి. పెట్టుబడుల గణాంకాలు ప్రభుత్వానికి గర్వకారణం కావచ్చు. కానీ ఉద్యోగాల గణాంకాలే యువతకు భరోసా ఇవ్వాలి.



వెంకటేశ్ గుగ్గిళ్ల,
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

దేశ రాజధాని ఢిల్లీలో పరిస్థితి చూస్తుంటే ఆ హక్కు కూడా ప్రజలకు దూరమవుతున్నట్లు కనిపిస్తోంది. ప్రతి ఏడాది చలికాలం మొదలవగానే గాలి నాణ్యత క్షీణించడం, పొగమంచు కమ్ముకోవడం, శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం సాధారణ పరిణామంగా మారిపోయింది. నవంబర్ 13న ఢిల్లీ మరోసారి ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరంగా వార్తల్లో నిలిచింది. లక్షలాది మంది ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న ఈ సమస్యపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సరిపోతున్నాయా? లేక ప్రతి ఏడాది అత్యవసర పరిస్థితి ప్రకటించి, కొద్దిరోజుల తర్వాత మళ్లీ యథాతథంగా వ్యవహరిస్తున్నాయా? అన్నది ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

ఊపిరి కోసం పోరాటం

రాయిటర్స్ నవంబర్ 13న ప్రచురించిన కథనం ప్రకారం ఢిల్లీ గాలి నాణ్యత తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరింది. స్విస్ సంస్థ ఐక్యూఎయిర్ లెక్కల ప్రకారం ఢిల్లీ గాలి నాణ్యత సూచీ 334గా నమోదై, ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. అదే సమయంలో భారత కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) సూచీని 403గా నమోదు చేసి తీవ్ర కాలుష్య స్థాయిగా వర్గీకరించింది. ఈ రెండు గణాంకాల్లో తేడా ఉండటానికి అవి ఉపయోగించే కొలతల పద్ధతులు, సూచీల ప్రమాణాలు వేర్వేరుగా ఉండటమే కారణం. అంటే సంఖ్యలు వేర్వేరుగా కనిపించినా పరిస్థితి ప్రమాదకరంగా ఉందన్న విషయంలో సందేహం లేదు. దాదాపు రెండు కోట్ల జనాభా ఉన్న నగరంలో లక్షలాది మంది ఈ కాలుష్య ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు గాలిలోని కాలుష్య కణాలు పైకి వెళ్లకుండా నేలమట్టానికి దగ్గరగా నిలిచిపోతాయి. గాలి వేగం తగ్గడం, పొగమంచు, వాహనాల నుంచి వెలువడే పొగ, నిర్మాణ పనుల దుమ్ము, పరిశ్రమల ఉద్గారాలు, పంట వ్యర్థాలను కాల్చడం వంటి కారణాలు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తాయి. దీపావళి సమయంలో బాణసంచా కాల్చడం కూడా కాలుష్యాన్ని పెంచే అంశాల్లో ఒకటి. అయితే ఢిల్లీ కాలుష్యానికి ఒక్క కారణాన్నే చూపించడం సమస్యను తప్పుదోవ పట్టించడమే అవుతుంది. ఇది అనేక కారణాలతో ఏర్పడుతున్న ప్రాంతీయ సమస్య. వాయు కాలుష్య నియంత్రణకు ఏర్పాటైన కమిషన్ (సీఏక్యూఎం) నవంబర్ 6 నుంచే ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ మూడో దశను అమల్లోకి తెచ్చింది. నిర్మాణ, కూల్చివేత పనులపై పరిమితులు, కాలుష్యం కలిగించే కార్యకలాపాల నియంత్రణ, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు అందులో భాగంగా ఉన్నాయి. కానీ ఇలాంటి చర్యలు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరిన తర్వాత మాత్రమే అమలవుతున్నాయి. సమస్యను ముందుగానే అంచనా వేసి నివారించడంలో ప్రభుత్వాలు ఇంకా వెనుకబడుతున్నాయన్న విమర్శకు ఇది



తావిస్తోంది. ఢిల్లీ ప్రభుత్వం రోడ్లపై నీటిని చల్లడం, స్ప్రింక్లర్లు వినియోగించడం వంటి చర్యలు చేపడుతోంది. ఇవి కొంతమేర దుమ్మును తగ్గించవచ్చు. కానీ వాహనాల నుంచి వెలువడే సూక్ష్మ కాలుష్య కణాలను, పరిశ్రమల ఉద్గారాలను, పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా నియంత్రించలేవు. రోడ్లపై నీళ్లు చల్లడం ఒక్కటే పరిష్కారమైతే ప్రతి శీతాకాలం ఇదే సమస్య ఎందుకు పునరావృతమవుతోంది? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. తాత్కాలిక చర్యలు అవసరమే. కానీ వాటితోపాటు దీర్ఘకాలిక ప్రణాళిక కూడా ఉండాలి.

ఢిల్లీ కాలుష్యాన్ని ఢిల్లీ ప్రభుత్వం ఒక్కటే పరిష్కరించలేదు. చుట్టుపక్కల హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలతో సమన్వయం అవసరం. పంట వ్యర్థాలను కాల్చకుండా రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి. వ్యవసాయ యంత్రాలపై సబ్సిడీ ఇవ్వడం మాత్రమే కాకుండా, పంట అవశేషాలను సేకరించి వినియోగించే పరిశ్రమలు, మార్కెట్లు అభివృద్ధి చేయాలి. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా ఉండాలంటే వారికి ఆర్థికంగా ప్రయోజనం కలిగే మార్గం చూపాలి. మరోవైపు ప్రజా రవాణాను బలోపేతం చేయాలి. బస్సులు, మెట్రో సేవలు పెంచి వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలి. నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము నియంత్రణ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కాలుష్యం ప్రభావం అందరిపై ఒకేలా ఉండదు. చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, రోడ్లపై విధులు నిర్వహించే పోలీసులు, పారిశుధ్య సిబ్బంది గంటల తరబడి కలుషిత గాలిలోనే ఉండాల్సి వస్తోంది. పాఠశాలల విషయంలో హైబ్రిడ్ తరగతులు, అవసరమైన చోట తాత్కాలిక మార్పులు చేయడం ఉపశమన చర్యలే. కానీ పిల్లలు చదువుకునే వాతావరణమే కలుషితంగా మారకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. ఆసుపత్రుల్లో కాలుష్య సంబంధిత సమస్యలతో వచ్చే రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అత్యవసర హెచ్చరికలు, ఆరోగ్య సూచనలు ప్రజలకు సమయానికి చేరాలి.

మరో ముఖ్యమైన అంశం కాలుష్య గణాంకాల విశ్వసనీయత. ఏ ప్రాంతంలో ఎంత కాలుష్యం ఉంది? ఏ సమయంలో పెరుగుతోంది? ఏ కారణంతో పెరుగుతోంది? అన్న వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. పర్యవేక్షణ కేంద్రాలు సక్రమంగా పనిచేయాలి. గణాంకాల్లో లోపాలు ఉంటే వాటిని సరిచేయాలి. ప్రభుత్వాలు తమ పనితీరును సమర్థించుకోవడానికి అనుకూలమైన సంఖ్యలను మాత్రమే చూపించే పరిస్థితి రాకూడదు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం పారదర్శకంగా ఉండాలి. కాలుష్యాన్ని ప్రతి ఏడాది వచ్చే శీతాకాల సమస్యగా మాత్రమే చూడటం మానుకోవాలి. ఇది ప్రజారోగ్యం, నగర ప్రణాళిక, వ్యవసాయ విధానం, రవాణా, పారిశ్రామిక విధానాలతో ముడిపడిన సమస్య. దీన్ని పరిష్కరించడానికి కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. కాలుష్య నియంత్రణకు కేటాయించే నిధుల వినియోగంపై ప్రజలకు లెక్క చెప్పాలి. ఏ చర్య వల్ల ఎంత ఫలితం వచ్చిందో శాస్త్రీయంగా అంచనా వేయాలి. స్వచ్ఛమైన గాలి కోసం ప్రజలు మాస్కులు ధరించాలనే సూచన ఇవ్వడం అవసరమే. కానీ కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యతను ప్రజలపై మాత్రమే నెట్టివేయకూడదు. ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి ప్రభుత్వ అనుమతి అవసరం లేని వాతావరణాన్ని సృష్టించడమే పాలన లక్ష్యం కావాలి. రాజధాని గాలి విషపూరితంగా మారితే అది ఒక్క నగరానికి సంబంధించిన సమస్య కాదు. దేశ పట్టణాభివృద్ధి విధానాలకే హెచ్చరిక.

శశిధర్ అక్కెల
జగిత్యాల జిల్లా

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!
పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039.
PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.